ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.
హిందూపురం, మడకశిర, పెనుకొండ :9985445760
ధర్మవరం, పుట్టపర్తి : 9963160529
కదిరి :9052518170
ఏసీఎమ్: 9985411154



గత ఏడాది ఎన్నికలకోడ్‌లో కూడా ఇంటి ముందు బారికేడ్లు

సరిగ్గా ఏడాది క్రితం ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన కథనం




ఓటమి తర్వాత ఖాళీ అయిన పార్టీకార్యాలయం

నాటి ఉషస్సు ఏదీ..?

ఓటమితో ప్రాభవం కోల్పోయిన మాజీ మంత్రి

చుట్టూరా నాయకులు, కార్యకర్తలు, ప్రజలు. అటుపై అనుక్షణం రక్షణ కాసే పోలీసులు. మందీమార్బలంతో మంత్రి హోదాలో ఎన్నికలకు ముందు ఉష శ్రీచరణ్ చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యేగా ఉన్న ఉష శ్రీచరణ్‌ను 2024 ఎన్నికల ముందు పెనుకొండ అసెంబ్లీ వైసీపీ అభ్యర్థిగా ప్రకటించి, పంపారు. ఇక్కడ ఎమ్మెల్యేగా ఉన్న శంకర నారాయణను అనంతపురం ఎంపీ అభ్యర్థిగా పంపారు. ఈ నేపథ్యంలో ఉష శ్రీచరణ్ 60, 70 వాహనాల కాన్వాయ్‌తో పెనుకొండ నియోజకవర్గం గ్రామాల్లో చక్కర్లు కొట్టారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా పెద్ద ఎత్తున పోలీసులతో హంగామా చేశారు. పెనుకొండలోని డీఎస్పీ కార్యాలయం సమీపంలో అద్దెకు ఇల్లు, పార్టీ కార్యాలయం తీసుకున్నారు. ఇంటికి వెళ్లేదారిలో పోలీసు బారికేడ్లు ఏర్పాటుచేసి ఉష శ్రీ అనుమతి ఉంటేనే లోనికి రానిచ్చేవారు. ఈ తంతు ఎన్నికలకోడ్ వచ్చినా కొనసాగించారు. ఎన్నికల్లో ఓటమి అనంతరం కార్ల హంగామాకు తెర పడింది. ఆమె కోసం వచ్చే నాయకులు కూడా కరువయ్యారు. దీంతో అంతకుముందు ఉన్న ఇంటిని కూడా వదిలి పెనుకొండ- మడకశిర ప్రధాన రహదారి పక్కన ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నారు.

ఎక్కువగా బెంగళూరులో ఉంటూ ఆమె నివాసంలోనే వీడియోలు తీసి వాట్సప్‌లో ప్రెస్‌నోట్లుగా పెడుతున్నారు. చుట్టపుచూపు గా నియోజకవర్గానికి వచ్చి వెళ్తున్నారు. ఏది ఏమైనా ప్రజాభిమానం ఉన్నంత వరకే నాయకుల దర్పం. ఒక్కసారి ప్రజలు ఛీదరిస్తే ఎంతటి వారైనా కనుమరుగు కావాల్సిందే. ప్రస్తుతం ఉష శ్రీచరణ్ పరిస్థితి కూడా ఇంతే.

- ఆంధ్రజ్యోతి, పెనుకొండ టౌన్

కరువు తీరా పైసలు..!

కాసులు కురిపిస్తున్న ఉపాధి పథకం

- ఫీల్డు అసిస్టెంట్ల ఇష్టారాజ్యం
- కొలతల్లో టీఏల మాయాజాలం
- వాటాలుగా అవినీతి సొమ్ము

పుట్టపర్తి టౌన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి హామీ పథకం(కరువు పని) అందులో పనిచేసే కొందరు సిబ్బందికి కాసుల వర్షం కురిపిస్తోంది. ఫీల్డు అసిస్టెంట్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండగా, వారికి అండగా టెక్నికల్ అసిస్టెంట్లు(టీఏ) కూలి పనుల కొలతల్లో మాయాజాలం చేస్తూ రూ.కోట్ల ప్రజాధనం స్వాహా చేస్తున్నారు. అక్రమాలను అరికట్టాల్సిన ఉన్నతాధికారులు మామూళ్ల మత్తులో వారికి వంత పాడుతున్నారు. పనులు చేయకున్నా, చేసినట్లు మస్టర్ల సృష్టించి అందినకాడికి దండుకుంటున్నారు.


ఉపాధి పనులు చేస్తున్న దృశ్యం (ఫైల్)

ఫీల్డు అసిస్టెంట్ల ఇష్టారాజ్యం

ఉపాధి పథకం పనుల్లో ప్రధాన భూమికి పోషిస్తున్న ఫీల్డు అసిస్టెంట్లు నకిలీ మస్టర్లు సృష్టించి అందినకాడికి దండుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో తాము చెప్పిందే వేదంగా, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. జిల్లాలోని 32 మండలాల్లో 365మంది ఫీల్డు అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. గ్రామాల నుంచి ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు వలసలు వెళ్లిన వారిపేర్లతో నకిలీ మస్టర్లు సృష్టించి, నీకింత, నాకింత అని దోచుకుంటున్నారు. కరువు పనులకు వెళ్లకున్నా, గ్రామాల్లోని చోటా, మోటా రాజకీయ నాయకులకు బిల్లులు చేసి పెడుతున్నారు. ప్రతివారం ఉపాధి బిల్లులు లబ్ధిదారుల ఖాతాలో జమ అయిన వెంటనే డ్రా చేయించి, ఫీల్డు అసిస్టెంట్లు పంచుకుంటున్నారు. అలాగే టెక్నికల్ అసిస్టెంట్లతో కుమ్మక్కై అసలైన ఉపాధి కూలీల కడుపు కొడుతున్నారు. నిజాయతీగా పనిచేస్తున్న కూలీలను కూడా వేధిస్తు, ప్రతి వారం ఒక కూలినుంచి రూ.వందనుంచి మూడు వందలు అక్రమంగా ఫీల్డు అసిస్టెంట్లు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.



డ్వామా కార్యాలయం

టెక్నికల్ అసిస్టెంట్ల మాయాజాలం

ఉపాధి పథకం కూలీలకు డబ్బు చెల్లించే విషయంలో టెక్నికల్ అసిస్టెంట్లదే కీలక పాత్ర. జిల్లాలోని 32 మండలాల్లో 152 మంది టెక్నికల్ అసిసెంట్లు పనిచేస్తున్నారు. వీరు ప్రతివారం ఉపాధి కూలీలు చేసిన పనిని కొలతలు తీసి రికార్డు చేరస్తారు. కొలతలు తీయడంలో టెక్నికల్ అసిస్టెంట్లు మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. కూలీలు చేసి నదాని కంటే ఎక్కువ రికార్డు చేస్తున్నారు. ప్రతివారం కూలీల ఖాతాల్లో డబ్బు జమ కాగానే డ్రాచేయించి అదనపు కొలతల ద్వారా ఎంత డబ్బు వస్తూందో దాన్ని టెక్నికల్ అసిస్టెంట్లు తీసేసుకుంటున్నారు. ఈవిధంగా ప్రతి వారం ఒక టెక్నికల్ అసిస్టెంట్ రూ.పది వేల నుంచి రూ.25 వేల వరకూ అక్రమంగా సంపాదిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సంపాదనలో కొంత మొత్తాన్ని కంప్యూటర్ ఆపరేటర్లు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు (ఈసీ), ఆపై అధికారులకు వాటలు ఇస్తున్నారు.

నిద్రావస్థలో అధికార గణం



జిల్లాలో ఉపాధి పథకంలో పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలు జరుగుతున్నా, ఆశాఖ ఉన్నతాధికారులు మాత్రం తమకు ఏమీ పట్టనట్లు నిద్రమత్తులో జోగుతున్నారు. ఫీల్డు, టెక్నికల్ అసిస్టెంట్ల నుంచి నెలనెల మామూళ్లు పుచ్చుకుని చూసీచూడనట్లు వ్యవహరిస్తు న్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అడపాదడపా తూతూమంత్రంగా తనిఖీ చేసి మిన్నకుండిపోతున్నారు. కొంతమంది జిల్లా స్థాయి అధికారులు కూడా టెక్నికల్, ఫీల్డు అసిస్టెంట్ల నుంచి క్రమం తప్పకుండా మామూళ్లు పుచ్చుకుంటున్నట్లు సమాచారం. సోషల్ ఆడిట్ నిర్వహించినప్పుడు నామమాత్రంగానే రికరీలు చేస్తున్నారు.

తనిఖీలు చేస్తాం



జిల్లాలో ఉపాధి పథకం అమలులో అవినీతిని సహించేదిలేదు. ఇక నుంచి అనుమానమున్న పంచాయతీల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తాం. ఇందుకోసం ప్రత్యేక బృందాలను నియమిస్తాం. ఫీల్డు, టెక్నికల్ అసిస్టెంట్లు అవినీతికి పాల్పడినట్లు రుజువైతే చర్యలు తీసుకుంటాం. సోషల్ ఆడిట్ నిర్వహించి సొమ్మును రికవరీ చేస్తాం. అలాగే విజిలెన్స్ విభాగం ద్వారా తనిఖీ చేయిస్తాం.

- విజయేంద్రప్రసాద్, డ్వామా పీడీ, శ్రీ సత్యసాయి జిల్లా

అర్హులకే ఉద్యోగాలు : ఎంపీ


నియామక పత్రాలను అందించిన ఎంపీ, ఎమ్మెల్యే

మడకశిరటౌన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల్లో అర్హులకే పెద్దపీట అని హిందూపురం లోక్‌సభ సభ్యుడు బీకే పార్థసారథి పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో శనివారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి అంగన్‌వాడీ నియామక పత్రాలను అందజేశారు. ఇటీవల నిర్వహించిన ఇంటర్వ్యూలలో ఆరుగురు ఎంపిక కాగా వారికి నియామకపత్రాలు అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వంలో చిన్న అటెండర్ పోస్టు కోసం కూడా భారీగా చేతివాటం ప్రదర్శించావారని, డబ్బు ఇచ్చిన వారికే ఉద్యోగాలు వచ్చేవని అన్నారు. చంద్రబాబు పాలనలో అలాంటి వాటికి ఆస్కారం ఉండదని, అర్హత ఉన్న వారికే నియామకాలు జరిగినట్లు తెలిపారు. అనంతరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్లకు నియామకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీనివాసమూర్తి, పాండురంగప్ప, లక్ష్మీనారాయణ, గణేష్, భక్తర్ పాల్గొన్నారు.

శరవేగంగా హంద్రీనీవా విస్తరణ

పనులు పునఃప్రారంభం.. మాట నిలుపుకున్న చంద్రబాబు

జూన్ 12లోగా పూర్తి చేయాలని లక్ష్యం

గుంతకల్లు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రకటించిన విధంగానే హంద్రీనీవా కాలువ విస్తరణ పనులను ప్రభుత్వం పునఃప్రారంభించింది. నీటి ఎత్తిపోతలు నిలిచిన వెంటనే ఈ పనులను ప్రారంభించేలా ప్రభుత్వం జలవనరుల శాఖను సమాయత్తపరిచింది.


కసాపురం వద్ద మట్టి కట్ట తొలగింపు పనులు

మరో 20 రోజులపాటు నీటిని పారించే అవకాశం ఉన్నా, పంటలన్నీ పూర్తికావడంతో ఎత్తిపోతలను గత వారంలో నిలిపివేసింది. విస్తరణ పనులను జగన్ ప్రభుత్వం ఐదేళ్లపాటు నిలిపివేసిన సంగతి తెలిసిందే. దీంతో అధికారంలోకి వచ్చిన వెంటనే హంద్రీనీవా కాలువను వెడెల్పు చేస్తామని, పూర్తి స్థాయిలో సాగునీటిని పారిస్తామని చంద్రబాబు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే ఏమాత్రం ఆలస్యం చేయకుండా పనులకు శ్రీకారం చుట్టారు. జూన్ 12 నాటికి పనులు పూర్తి చేయడమే లక్ష్యంగా (తరువాయి 6లో)

ఆగిన పల్లె పండుగ..!

వివరాలు 6లో...

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

ధర్మవరం రూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగాటిపల్లి గ్రామ పొలాల్లో ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం శనివారం వెలుగులోకి వచ్చింది. రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆనవాళ్లను బట్టి ధర్మవరం పట్టణంలోని తిక్కస్వామి గుడి సమీపంలో నివసిస్తున్న బ్యాళ్ల అక్కమ్మ (50)గా ఆమెను గుర్తించారు. ఈమెకు చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం గ్రామంలో చిన్నగంగన్నతో వివాహమై ఇద్దరుకుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. అయితే ఈమె కొన్నేళ్ల క్రితం తనకుటుంబసభ్యులతో విడిపోయి ధర్మవరం పట్టణంలోని తిక్కస్వామి సమీపంలో ఒంటరిగా నివసిస్తోంది. ఈ క్రమంలో శనివారం రేగాటిపల్లి గ్రామపొలాల్లో ఆమె మృతదేహం లభ్యమైంది. డీఎస్పీ హేమంత్‌కుమార్, సీఐ ప్రభాకర్, ఎస్ఐ శ్రీనివాసులు ఆమె మృతదేహాన్ని సందర్శించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహంపై వస్త్రాలు లేకపోవడం, తలఅంతా కుళ్లి ఛిద్రం కావడంతో, వారంరోజుల క్రితమే చనిపోయి ఉంటుందని పోలీసులు భావించారు. డ్వాగ్‌స్కాడ్, క్లూస్‌టీం ద్వారా పలుకోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా సంఘటనా స్థలాన్ని ఎస్పీ రత్న పరిశీలించారు. మహిళ మృతికి గల కారణాలను దర్యాప్తును వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించింది.

రేపు పురానికి సీపీఐ రామకృష్ణ

హిందూపురం అర్బన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ సోమవారం హిందూపురం రానున్నట్లు పట్టణ కార్యదర్శి వినోద్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నాడు. ఈ నెల 23న అమరవీరుల దినోత్సవా న్ని, ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి ని పురస్కరించుకుని సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి ఏప్రిల్ 14 వరకు దేశ వ్యాప్తంగా ర్యాలీలు, సదస్సులు చేపట్టాలని పిలునిచ్చారన్నారు. ఈ నేపథ్యంలోనే ఈ నెల 24న హిందూపురం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు సదస్సు జరుగుతుందన్నాడు. కార్యక్రమానికి హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల నుంచి పార్టీ కార్యదర్శులు, మండల కార్యదర్శులు, సహాయ కార్యదర్శులు, ప్రజా సంఘాల అధ్యక్ష కార్యదర్శులు తదితరులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు.

పరీక్షలకు ఏడుగురు గైర్హాజరు

కొత్తచెరువు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో శనివారం ఏడుగురు గైర్హాజరయ్యారని డీఈఓ కిష్టప్ప తెలిపారు. కాంపోజిట్ పరీక్ష 30 మార్కులకు నిర్వహించినట్లు వివరించారు. 38 పరీక్షా కేంద్రాలకు గాను రెగ్యులర్, ప్రైవేటు 1345 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 1338 మంది రాశారని, ఏడుగురు గైర్హాజరయ్యారని డీఈఓ తెలిపారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.35 (ఆదివారం సాయంత్రం)
సెహరీ : 5.02 (సోమవారం ఉదయం)

కొండ పిండి..!


- గ్రానైట్ మాఫియా ఇష్టారాజ్యం
- చోద్యం చూస్తున్న అధికారులు

బుక్కపట్నం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): గ్రానైట్ మాఫియాకు అడ్డూఅదుపు లేకపోవడంతో చెలరేగిపోతోంది. ప్రభుత్వ అనుమతులు లేకపోయినా, రాయల్టీలు చెల్లించకపోయినా కొండను కొల్లకొడుతున్నారు. బహిరంగంగా పెద్దఎత్తున గ్రానైట్ మాఫియా ప్రభుత్వ ఆస్తులను దోచుకుంటున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు. బుక్కపట్నం మండలంలోని అగ్రహారం గ్రామ రెవెన్యూ పొలం సర్వే నంబరు 809-7లో గత ఎనిమిదేళ్లుగా గ్రానైట్‌ను అక్రమంగా తోలుతున్నారు. చిలకలగడ్డపల్లి, రెడ్డిపల్లి గ్రామాల మధ్య రోడ్డు పక్కనే రిజర్వు ఫారెస్టుకు ఆనుకుని ఈ దోపిడీ కొనసాగుతోంది. రోజుకు 10 వాహనాలలో గ్రానైట్‌ను అక్కడి నుంచి తరలిస్తున్నారు. గ్రానైట్‌ను వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఎనిమిదేళ్ల నుంచి దాదాపు రూ.20 కోట్ల విలువ చేసే ప్రభుత్వ సంపదను దోచుకున్నట్లు తెలుస్తోంది. పాముదుర్తి గ్రామానికి చెందిన ఓ వైసీపీ నాయకుడు ఈ తతంగాన్ని ముందుండి నడిపిస్తున్నట్లు సమాచారం. సమీప గ్రామాల ప్రజలకు అనుమానం రాకుండా ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకున్నట్లు గ్రానైట్ మాఫియా ప్రచారం చేసుకుంటోంది. ఎనిమిదేళ్లుగా గ్రానైట్‌ను బహిరంగంగా తరలిస్తున్నా ఇంతవరకు అధికారులు చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. కింది స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు మామూళ్లు తీసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రాయల్టీ రూపంలో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని అధికారులే గండికొడుతున్నారు.


తరలించడానికి సిద్ధంగా ఉన్న గ్రానైట్ బండలు

విచారించి చర్యలు చేపడతాం: చక్రపాణి, డీఎఫ్ఓ

చిలకలగడ్డపల్లి, రెడ్డిపల్లి గ్రామాల మధ్య ఫారెస్టుకు ఆనుకుని బఫర్‌జోన్‌లో అక్రమంగా గ్రానైట్ తరలిస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. విచారించి తగిన చర్యలు తీసుకుంటాం.


రహదారి

అనుమతులు ఇవ్వలేదు

చిలకలగడ్డపల్లి, రెడ్డిపల్లి గ్రామాల నుంచి గ్రానైట్ తవ్వకాలకు ఎలాంటి అనుమతులు రెవిన్యూశాఖ ఇవ్వలేదు. కనీసం రాళ్లు తవ్వడానికి కూడా అనుమతులులేవు. ఈ విషయంపై విచారించి చర్యలు చేపడుతాం.

- షాబుద్దీన్, తహసీల్దార్, బుక్కపట్నం

ఆగిన పల్లె పండుగ..!

- బిల్లులు రాక నిలిచిన పనులు
- సీసీ రోడ్లవే రూ. 2.64 కోట్లు పెండింగ్
- అసంపూర్తిగా గోకులాలు
- నిధులు రాక కాంట్రాక్టర్ల లబోదిబో

కొళగాన హళ్లిలో నిర్మించిన సీసీరోడ్డు



బొమ్మనహాళ్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులకు బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా సీసీ రోడ్ల నిర్మాణానికి సంబంధించి బిల్లులు ఆలస్యం అయ్యాయి. గోకులాల షెడ్లను సొంత నిధులతో ప్రారంభించిన రైతులు కూడా బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. మండలానికి రూ. 3.51 కోట్లతో 83 పనులు మంజురయ్యాయి. ఇందులో 82 పనులను పూర్తి చేశారు. గోనేహాళ్ గ్రామంలో ఒక రోడ్డు మాత్రమే పెండింగ్‌లో ఉంది. మండల వ్యాప్తంగా సీసీ రోడ్లకు సంబంధించి రూ. 2.64 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నా యి. ఈ పనులకు ఉపాధి హామీ పథకం నుంచి నిధులు కేటాయిం చారు.

ఆగిన గోకులాలు

రెండునెలలుగా బిల్లులు రాకపోవడంతో గోకులాల షెడ్ల నిర్మాణం ఆపేశారు. సీసీ రోడ్లకు సంబంధించి ఒక్కో పనిని రూ. 3 లక్షల వరకు విభజించి నామినేషన్ ప్రాతిపదికపై కాంట్రాక్టర్లకు అప్పగించారు. వీరంతా చిన్నాచితకా

బొమ్మనహాళ్‌లో అసంపూర్తిగా ఉన్న గోకులం షెడ్డు



కాంట్రాక్టర్లు కావడంతో బిల్లులు రాక లబోదిబోమంటున్నారు. పనులను ఒత్తిడితో పూర్తి చేయించారని బిల్లులు ఇవ్వడంలో అలస్యం చేస్తున్నారని అవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులకు సంబంధించి ఉపాధి హామీ పనుల ద్వారా సమకూరే మెటీరియల్ కాంపోనెంట్ నిధులను వెచ్చిస్తున్నారు. ఈ నిధులు 75 శాతం కేంద్రం, మిగిలిన 25 శాతం రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. అయితే ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు చెల్లించడానికి కొంత జాప్యం కావచ్చు అని అధికారులు అంటున్నారు.

రూ.4.22 కోట్ల అంచనాలతో పనులు..

రాష్ట్ర ప్రభుత్వం గతేడాది అక్టోబరు 14 నుంచి పల్లె పండుగ పేరుతో అభివృద్ధి పనులు ప్రారంభించింది. ఉపాధి హామీ పథకానికి సంబంధించి మెటీరియల్ కాంపోనెట్, ఆర్థిక సంఘం నిధులు ద్వారా బిల్లులు చెల్లించే విధంగా పనులకు అధికారులు ప్రతిపాదనలు పంపించారు. గ్రామాల్లో ఎక్కడెక్కడ సీసీ రోడ్లు అవసరమో గుర్తించి వాటిని నిర్మించడానికి వీలుగా అంచనాలు సిద్ధం చేసి పంపించారు. రైతుల కోసం గోకులాల షెడ్లను ఈ పథకంలో చేర్చారు. సీసీ రోడ్లు, గోకులాలు షెడ్లకు సంబంధించి మండలంలో రూ.4.22 కోట్ల అంచనాలతో పనులు ప్రారంభించారు. ఇందులో ఇప్పటి వరకు రూ. 85 లక్షలు బిల్లులు మాత్రమే చెల్లించారు. కానీ పూర్తయినా మధ్యలో కొనసాగుతున్న పనులకు సంబంధించి ఇంకా రూ. 3.35 కోట్లు వరకు బకాయిలు పేరుకుపోయాయి. డిసెంబరు నెలాఖరు వరకు వారం వారం వచ్చిన బిల్లులు ఆ తర్వాత నుంచి పూర్తిగా నిలిచిపోయాయి. కాంట్రాక్టర్లు మాత్రం రోడ్లను పూర్తి చేశారు. రైతులు మాత్రం గోకులాలను అర్ధంతరంగా నిలిపివేశారు. బిల్లులు వస్తేనే తిరిగి చేయగలమంటూ అధికారులకు తెగేసి చెప్పేస్తున్నారు. మండల వ్యాప్తంగా 31 గోకులాలు మంజూరు కాగా 12 మాత్రమే పూర్తి అయ్యాయి.

బిల్లులు అప్‌లోడ్ చేశాం



మండలంలో పల్లె పండుగలో భాగంగా రూ. 3.51 కోట్లతో 83 రోడ్లు మంజురు కాగా 82 పూర్తి చేశాం. గోనేహాళ్ గ్రామంలో మాత్రమే ఒక రోడ్డు పెండింగ్ లో ఉంది. రూ. 85 లక్షలు వరకు బిల్లులు చెల్లించాం. రూ. 2.64 కోట్లు రావాల్సి ఉంది. పెండింగ్ బిల్లులు మొత్తం అప్‌లోడ్ చేశాం.

- జగదీష్, జేఈఈ, పంచాయతీరాజ్, బొమ్మనహాళ్

రైతు ఆత్మహత్యాయత్నం

సర్వేయర్ బెదిరింపులే కారణమా..?



బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రైతు

బత్తలపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): విలేజ్ సర్వేర్ బెదిరించాడని మండలంలోని దంపేట్ల గ్రామానికి చెందిన నారాయణస్వామి శనివారం పు రుగులు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు తెలిపిన మేరకు దంపేట్ల గ్రామానికి చెందిన నారాయణ స్వామికి అదే గ్రామములో సర్వే నెంబర్ 348లో 2.4 ఎకరాల పొలం ఉంది. అందులో బోరు వేసుకుని మొక్కజొన్నసాగు చేశాడు. నారాయణస్వామి శనివారం తన పొలానికి కంచె వేస్తుండగా సర్వేర్ రవి కిరణ్ ఫోన్ చేసి నువ్వు కంచె వేస్తే పోలీస్ కేసు పెట్టి నీకు భూమి లేకుండా చేస్తానని బెదిరించాడు. ఎందుకు వేయకూడదు అని ప్రశ్నించగా బోరుబావి ఉన్నప్రాం తం వేరే రైతుకు పోతుంది అని సర్వేయర్ చెప్పాడు. దీంతో రైతు ఇప్పటికే 5సార్లు కొలతలు వేశారు. నాభూమిలో ఉన్న బోరు వేరేవాళ్లకు పోతే నేను ఎలా బతకాలి నాకు చావే శరణ్యం అంటూ పురుగుల మందు తాగా డు. గమనించిన తల్లి సంజ మ్మ, చుట్టు పక్కల రైతుల సాయంతో బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. ఆర్డీటీ ఆసుపత్రికి వెళ్లి విచారించగా బెంగళూరుకు తరలించినట్లు ఆసుపత్రి సిబ్బంది తెలిపారని ఎస్ఐ సోమశేఖర్ తెలిపాడు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయలేదన్నారు. విలే జ్ సర్వేయర్ అనవసరంగా సమస్య లు సృష్టించి డబ్బు లు డిమాడ్ చేస్తున్నాడని గ్రామస్థులు ఆరోపించారు.

ప్రాణాలు తీస్తున్న నిర్లక్ష్యం

అనంతపురం-ఉరవకొండ రహదారిలో తరచూ ప్రమాదాలు

- గాలిలో కలిసిపోతున్న ప్రాణాలు
- వాహనాల వేగ నియంత్రణకు చర్యలేవీ?



కమ్మూరు వద్ద రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న కారు, ఆటో (ఫైల్)

కూడేరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారిపై ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. తరచూ ప్రమాదాలు జరిగి.. ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. పలువురు తీవ్రంగా గాయపడి మంచాలకే పరిమితమవుతున్నారు. ప్రమాదాలకు నిర్లక్ష్యపు డ్రైవింగ్ ప్రధాన కారణమని పోలీసుల విచారణలో తేలుతోంది. అతివేగంతో వాహనాలు దూసుకొస్తున్నాయి. అదుపు చేయలేక ఢీకొంటున్నట్లు ప్రమాదాల తీరును బట్టి తెలుస్తోంది. అయినా వాహనాల వేగ నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించట్లేదు.

ప్రమాదకర మలుపులు

అనంతపురం నగర శివార్ల నుంచి పెన్నహోబిలం వరకు 30 కిలోమీటర్ల దూరం ఉంది. ఈ ప్రాంతంలోనే రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. మండలంలోని బ్రాహ్మణపల్లి, కమ్మూరు, అరవకూరు చెరువుకట్ట, కూడేరు సమీ పం లోని శివా రె డ్డి తో ట,



ఉదిరిపికొండ గ్రామం వద్ద మలుపు

ఇటీవలి రోడ్డు ప్రమాదాల్లో కొన్ని..

- 2023వ సంవత్సరంలో కమ్మూరు గ్రామ సమీపంలోని ఐశ్వర్య వెంచర్ వద్ద ద్విచక్రవాహనంలో వస్తున్న ముగ్గురు యువకులు దున్నపోతును ఢీకొన్నారు. ఇద్దరు మరణించారు.
- ముద్దలాపురం గ్రామ సమీపంలోని శివారెడ్డి తోటవద్ద ద్విచక్రవాహనం, బస్సు ఢీకొనడంతో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు.
- 2024 అక్టోబరులో శివరాంపేట సమీపంలోని క్రాస్ వద్ద ముగ్గురు యువకులు ద్విచక్రవాహనంలో వెళ్తూ కారును ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందారు.
- ఈ నెలలోనే కమ్మూరు గ్రామ సమీపాన ఆటోను కారు ఢీకొట్టడంతో ముగ్గురు అక్కాచెల్లెళ్లతోపాటు, మూడు నెలల చిన్నారి మృతి చెందారు. ఈ ప్రమాదం మూడు కుటుంబాల్లో విషాదం నింపింది.

ముద్దలాపురం, జల్లిపల్లి, ఉదిరిపికొండ, శివరాంపేట గ్రామాల వద్ద మలుపులు అత్యంత ప్రమాదకరంగా మారాయి. కూడేరు, ముద్దలాపురం మధ్యనున్న శివారెడ్డి తోట వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో పోలీసులు ఆ ప్రదేశాన్ని బ్లాక్ స్పాట్‌గా గుర్తించారు. ఒకేచోట రెండు, అంత కంటే ఎక్కువ ప్రమాదాలు జరిగితే పోలీసులు వాహనాల వేగాన్ని త్రించేందుకు సూచికలు ఏర్పాటు చేస్తారు. ఈ రహదారిలో ఏకంగా 8 ప్రమాదకర మలుపులను గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారిపై వాహనాలు వేగంగా వస్తుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుకిరువైపులా గ్రామాల్లో ప్రజలు, విద్యార్థులు రోడ్డు దాటడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలకేంద్రంతోపాటు కమ్మూరు, అరవకూరు, ముద్దలాపురం, ఉదిరిపికొండ, శివరాంపేట తదితర గ్రామాల్లో స్పీడ్ బ్రేకర్లు వేయాలి. వాహనాల వేగాన్ని నియంత్రించే చర్యలు చేపట్టాలి. మలుపులు అధికంగా ఉన్న ప్రదేశాల్లో ప్రమాద సూచికలతోపాటు వేగం తగ్గించే చర్యలు తీసుకోవాలి.

- కృష్ణమూర్తి, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు

ప్రమాదాల నియంత్రణకు చర్యలు



అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారిపై వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు చర్యలు చేపడుతున్నాం. వాహనదారులు నిబంధనలు పాటించకపోతే కఠినంగా వ్యవహరిస్తాం. రోజూ వాహన తనిఖీలు చేపడుతూ అవగాహన కల్పిస్తున్నాం. ప్రధాన రహదారిపై ప్రమాదాల నివారణే లక్ష్యం.

- రాజు, సీఐ, కూడేరు అప్‌గ్రేడ్ స్టేషన్

శరవేగంగా విస్తరణ



జి. కొట్టాల వద్ద కాలువలో నీటిని మోటార్లతో తోడేస్తున్న దృశ్యం

(5వ పేజీ తరువాయి)

ముందుకు సాగుతున్నారు.

ఇదీ నేపథ్యం.. కర్నూలు జిల్లా మల్యాల నుంచి అనంతపురం జిల్లా జీడిపల్లి రిజర్వాయరు వరకూ 216 కి.మీ. హంద్రీనీవా కాలువను వెడెల్పు చేస్తామని 2017లో పామిడిలో ఏర్పాటుచేసిన సభలో చంద్రబాబు ప్రకటించారు. అప్పట్లో 90 రోజుల వ్యవధిలో పనులు పూర్తయ్యేలా టార్గెట్ ఇచ్చినా సాధ్యపడలేదు. 2019 ఎన్నికల నాటికి మట్టిపనులు 50 శాతం పూర్తికాగా, మట్టికట్టలు, సిమెంటు లైనింగ్ పనులను చేపట్టలేకపోయారు. ఆ ఎన్నికల్లో వైసీపీ గెలవడంతో పనులు అటకెక్కాయి. హంద్రీనీవా కాంట్రాక్టులన్నింటినీ జగన్ రద్దు చేయించారు. 2023లో లైనింగ్‌తో వైడెనింగ్ చేపడతామని ప్రకటించి టెండర్లు నిర్వహించారు. కానీ పనులు చేపట్టలేదు. 2024 ఎన్నికల అనంతరం చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టిన వెంటనే వైడెనింగ్‌కు కసరత్తు ప్రారంభించారు. ప్రాజెక్టు నిర్మించినప్పుడు లక్ష్యంగా ఉన్న 3,850 క్యూసెక్కుల నీరు పారేలా వెడెల్పు చేయడానికి అంచనాలు వేయించారు. రూ.400 కోట్లతో టెండర్లను నిర్వహించారు. వీపీఆర్ సంస్థ పనులను దక్కించుకుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆగమేఘాలపై పనులకు శ్రీకారం చుట్టింది

90 రోజుల టార్గెట్ వచ్చే ఖరీఫ్ ఆరంభమయ్యేలోగా విస్తరణ పనులు పూర్తి కావాలన్న లక్ష్యంతో కాంట్రాక్టు సంస్థ రంగంలోకి దిగింది. మల్యాల నుంచి జీడిపల్లి రిజర్వాయరు వరకూ 216 కి.మీ. మేర అడుగడుగునా మిషనరీని దించి కార్యాచరణ చేపట్టింది. గ్రావిటీ కంటే కింద నీరు పారేచోట కాలువ పనులు ఆలస్యమైనా పర్వాలేదు, నేలకు సమాంతరంగా నీరు పారే చోట్ల నిర్మించిన మట్టికట్ట పనులు ఎట్టిపరిస్థితుల్లోనూ 90 రోజుల్లో పూర్తిచేయడానికి రంగం సిద్ధంచేశారు. జిల్లాలో హంద్రీనీవాకు కసాపురం, జీ కొట్టాల, రాగులపాడు పంప్ హౌస్ వద్ద, ఎస్ఎస్‌పీ తాండా సమీపంలో ఉన్న మట్టికట్టల తొలగింపు కార్యక్రమాన్ని తొలుత చేపట్టారు. భూమికి సమాంతరంగా నీరుపారే చోట్ల మట్టికట్టలను తొలగించిన తర్వాత పనులు పూర్తికాకపోతే హంద్రీనీవాలో నీరు పారడం సాధ్యంకాదు. కనుక మట్టికట్టల పనులను తొలుత చేపట్టి, త్వరగా పూర్తిచేయడానికి చర్యలు చేపట్టారు. హంద్రీనీవా కాలువ కుడి గట్టు (ఉత్తరం వైపు గట్టు) మాత్రమే తొలగించి కాలువను వెడెల్పు చేసే పనులను ప్రారంభించారు. మార్కింగ్ చేయడానికి తొలుత జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. కసాపురం సమీపంలో కాలువ గట్లపై కంప చెట్లను తొలగించడం పూర్తికావడంతో ఇంజనీరింగ్ అధికారులు మార్కింగ్ ఇవ్వగా బండ్ తొలగింపును ప్రారంభించారు. జి.కొట్టాల తదితర ప్రాంతాల్లో జంగిల్ క్లియరెన్స్ జరుగుతోంది.

వేగంగా డీ వాటరింగ్ నీటిపారుదల ఆగిపోయినా రాగులపాడు పంప్‌హౌస్ నుంచి దిగువకు నీరు నిలిచి ఉంది. ఆ నీటిని తరలిస్తే తప్ప గట్టును తొలగించడానికి సాధ్యపడదు. దీంతో నిల్వ ఉన్న నీటిని తోడే పనులను చేపట్టారు. కసాపురం తూముకు సమీపంలో కుడి వైపు గట్టును తెంచి నీటిని వంకలోకి వదులుతున్నారు. జి.కొట్టాల వద్ద మోటార్లను బిగించి నీటిని బయటకు తోడేస్తున్నారు. కసాపురం వద్ద జంగిల్ క్లియరెన్సు, డీవాటరింగ్ పూర్తి కావడంతో ఎక్స్‌కవేటర్లతో బండ్ షిఫ్టింగ్ చేపట్టారు. ప్రస్తుతం కాల్వ 9.5 అడుగుల బెడ్ ఉండగా, దాన్ని కొన్ని చోట్ల అదనంగా 6 అడుగుల వెడెల్పు, మరికొన్ని చోట్ల అదనంగా 8 అడుగుల వెడెల్పుచేస్తారు. వంతెనలు, స్లూయిజ్ చానల్ స్ట్రక్చర్స్ ఉన్నచోట్ల కాలువను వెడెల్పు చేయరు. 2005లో హంద్రీనీవాను 3,850 క్యూసెక్కుల నీరు పారేలా డిజైన్ చేశారు. కానీ కాలువ సామర్థ్యం అందుకు తగినవిధంగా లేదు. విస్తరణ పనులు పూర్తయితే.. పూర్తి సామర్థ్యంతో నీరు పారుతుంది.

ఇది పామిడి-కల్లూరు మధ్య పెన్నానదిపై నిర్మించిన వంతెన. టీడీపీ హయాంలో రూ.48లక్షలతోనే మూడో కాలువపై ఈ వంతెన నిర్మించారు. సైడ్ వాల్స్ నాణ్యంగా కట్టారు. 2022లో పెన్నానదిలో వరద ఈ వంతెన మీదుగానే ఉధృతంగా ప్రవహించినా ఏమాత్రం చెక్కుచెదరలేదు.



- పెన్నానది వంతెనల మరమ్మతుల్లో నాణ్యతకు తిలోదకాలు
- సైడ్ వాల్స్ కట్టకుండా దిమ్మెలతో సరి..
- అవి కూడా.. పడిపోయిన దుస్థితి
- రెండు వాహనాలు ఒకేసారి వెళ్లడానికి ఇబ్బంది
- ఎదురుగా వాహనం వస్తే బెంబేలెత్తుతున్న ప్రయాణికులు
- ప్రమాదపుటంచున ప్రయాణాలు
- తరచూ ప్రమాదాలు

ఇది పామిడి-కల్లూరు మధ్య పెన్నానదిపై ఉన్న వంతెన. 2022లో నదికి భారీ వరద రావడంతో నదిలోని ఈ రహదారిలో రెండు వంతెనలు పూర్తిగా ఛిద్రమయ్యాయి. అప్పటి వైసీపీ ప్రభుత్వం రెండు వంతెనల మరమ్మతులు, రోడ్డులో అక్కడక్కడా ప్యాచ్ వర్కులు చేసింది. ఇందుకోసం ఏకంగా రూ.3.15 కోట్లు ఖర్చు చేసింది. వంతెనల కింద పిల్లర్లకు కనీసం ప్లాస్టింగ్ కూడా చేయలేదు. రోడ్డుపై చేసిన ప్యాచ్ వర్కులు అప్పుడే దెబ్బతిన్నాయి. ఈలెక్కన నాసిరకంగా పనులు చేశారని స్పష్టమవుతోంది. కోట్ల రూపాయల నిధులు ఏం చేశారో, ఎవరు కాజేశారో అంతుచిక్కని విషయంగా మారింది.

టమోటా కిలో రూ. 8



అనంతపురం రూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 8తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శనివారం 120 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 7, కనిష్ఠ ధర రూ. 6 పలికినట్లు ఆయన తెలిపారు.



నదిలోకి నిధులు..!

వైసీపీ హయాంలో స్వాహాపర్వం

పామిడి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పామిడి-కల్లూరు మధ్య పెన్నానదిపై ప్రయాణమంటే వాహనదారులు హడలెత్తుతున్నారు. వంతెనలు మరీ ఇరుకుగా ఉన్నాయి. ఎదురుగా వాహనం వచ్చిందంటే దాటుకోవడం చాలాకష్టం. కనీసం అంచుల్లో సైడ్‌వాల్స్ కూడా లేవు. అక్కడక్కడా పిల్లర్లు కట్టినా వాటిలో చాలావరకు ధ్వంసమయ్యాయి. దీంతో అంచుల్లో వాహనదారులు ఏమాత్రం ఆదమరచినా ప్రమాదం తప్పదు. భయంభయంగా ప్రయాణిస్తున్నారు. వైసీపీ హయాంలో చేపట్టిన వంతెనల మరమ్మతు పనులు కాంట్రాక్టర్‌కు కాసుల వర్షం కురిపించినా.. ప్రయాణికులకు మాత్రం ప్రాణసంకటంగా మారాయి. తూతూమంత్రంగా పనులు చేపట్టి రూ.కోట్లాది ప్రజాధనాన్ని దోచుకున్నారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. పెన్నానది వంతెనలపై ప్రమాదాల పాపం వైసీపీదేనని దుమ్మెత్తిపోస్తున్నారు.

పెన్నానదిలో ప్రమాదానికి గురైన కారు



ప్రమాదాల ప్రయాణం

పామిడి-కల్లూరు (బీసీసీ రోడ్డు) పెన్నానదిపై ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. ఈ రోడ్డుపై నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రతి నెలా ఏదో ఒక ప్రమాదం జరుగుతూనే ఉంది. అయినా వాటి నివారణకు అధికారులు, పాలకులు చర్యలు తీసుకున్న పాపానపోలేదు. 2022లో వర్షాలకు పెన్నానది ఉధృతంగా ప్రవహించింది. దీంతో పామిడి-కల్లూరు (బీసీసీ రోడ్డు) ప్రధాన రహదారి పెన్నానదిలోని వంతెనలు శిథిలమయ్యాయి. రోడ్డు ఛిద్రమైంది. పెన్నానదిలోని వంతెనలు, రోడ్డు మరమ్మతులు చేపట్టేందుకు ఆర్అండ్‌బీ అత్యవసర నిధులు రూ.3.15కోట్లు మంజూరు చేశారు. శిథిలమైన వంతెనల వద్ద బెడ్డింగ్ వేసి, పైపులు అమర్చేందుకు ఎనిమిది నెలలు పట్టింది. రోడ్డుపై అక్కడక్కడా ఏర్పడిన గుంతలపై తారుతో ప్యాచ్ వర్క్ చేసి, చేతులు దులుపుకున్నారు. ఆ ప్యాచ్ వర్కులు మూడు నెలలకే దెబ్బతినడం గమనార్హం. బెడ్డింగ్ వేసి పైపులను అమర్చి ఆ రోడ్డుపై మొక్కుబడిగా దూరదూరంగా సిమెంటు దిమ్మెలను ఏర్పాటు చేశారు. కొన్నిచోట్ల ఏమాత్రం భద్రతా చర్యలు చేపట్టలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంతపెద్ద వంతెన, రోడ్డుకు భద్రతా చర్యలు తీసుకోకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. గతంలో ఓ ద్విచక్రవాహనదారుడు మృతిచెందాడు. ఈ రోడ్డులో ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. వాహనాలు ఎదురెదురుగా వచ్చినపుడు ఏ మాత్రం అజాగ్రత్త వహించినా ప్రమాదం తప్పదని జనం బెంబేలెత్తుతున్నారు.

ప్రమాదకరంగా పామిడి పెన్నానది వంతెన



కాంట్రాక్టర్లకు కల్పతరువు

పామిడి-కల్లూరు మధ్య (బీసీసీ రోడ్డు) పెన్నానది వంతెనలు కాంట్రాక్టర్లకు కల్పతరువుగా మారాయని, ఇందుకు వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన మరమ్మతులే నిదర్శనమని ప్రజలు ఆరోపిస్తున్నారు. వరదనీటి ప్రవాహానికి వంతెనలు పటుత్వం కోల్పోయాయి. వంతెనల కింద ఉన్న రాళ్ల దిమ్మెలు నెర్రెలు ఇచ్చాయి. వంతెనల్లో పలుచోట్ల ఏపుగా పిచ్చి మొక్కలు పెరిగాయి. చెత్త పేరుకుపోయింది. పలుచోట్ల పూర్తిగా మట్టితో మూసుకుపోయాయి. వైసీపీ ప్రభుత్వంలో ఈ వంతెనలు.. కాంట్రాక్టర్లకు కాసుల వర్షం కురిపించాయని ప్రజలు బాహాటంగా చెబుతున్నారు. ఇంత అధ్వానంగా ఉన్న వంతెనలకు కనీస మరమ్మతులు చేపట్టకపోవడం శోచనీయం. వరద వస్తే.. మళ్లీ ఛిద్రమవుతాయని ప్రజలు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. పెన్నానదిలో వంతెనల భద్రతను గాలికి వదిలేయకుండా ఈ వేసవిలో పటిష్ఠ పరచాలనీ, మరోసారి ప్రజలు, ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వంతెన పనులపై విచారణ చేపట్టాలి



హమాలీ గోపాల్, పామిడివైసీపీ ప్రభుత్వంలో రూ.3.15 కోట్లతో చేపట్టిన పామిడి-కల్లూరు పెన్నానది (బీసీసీ రోడ్డు) వంతెన పనులపై విచారణ చేపట్టాలి. టీడీపీ హయాంలో రూ.48లక్షలతోనే మూడో కాలువ వంతెన నిర్మాణం చేపట్టారు. 2022లో పెన్నానదిలో వరద ఈ వంతెన మీదుగానే ఉధృతంగా ప్రవహించినా ఏమాత్రం చెక్కుచెదరలేదు. వైసీపీ ప్రభుత్వంలో రూ.కోట్ల ప్రజాధనం వెచ్చించినా కనీసం వంతెనల కింద ఉన్న రాళ్ల దిమ్మెలకు ప్లాస్టింగ్ కూడా చేయలేదు. రోడ్డుకు ఇరువైపులా సక్రమంగా సిమెంటు దిమ్మెలను ఏర్పాటు చేయలేకపోయారు. కొన్ని వంతెనలపై వాహనాలు వస్తే పాదచారులు పక్కన నిలబడలేని పరిస్థితి ఉంది. ఈ పనులపై విచారణ చేపట్టాలి.

- హమాలీ గోపాల్, పామిడి



ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన తలారి వెంకటేష్ (ఫైల్)

కోలాహలంగా తీర్థవాది

కుంకుమ, గాజులు కొనుగోలు చేసిన మహిళలు

నేటితో ముగియనున్న బ్రహ్మోత్సవాలు



తీర్థవాదిలో పాల్గొన్న భక్తులు

కదిరి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం తీర్థవాదిని కోలాహలంగా నిర్వహించారు. ఉదయం నిత్యపూజ, హోమం, అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు ఆలయ ప్రాంగణంలో కొలువుతీరారు. వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది, ఆలయ అర్చకులు, భక్తులు శ్రీవారి వెంట నడుస్తూ రంగులు చల్లుకుని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం అమ్మవార్లను, శ్రీవారిని ఆలయ పడమటి దిక్కున ఉన్న భృగుతీర్థం వద్దకు చేర్చి, అభిషేకాలు నిర్వహించారు. భక్తుల గోవిందనామ స్మరణ మధ్య శ్రీచక్ర స్నానం ఘనంగా ముగిసింది. కార్యక్రమంలో ఈఓ వి. శ్రీనివాసరెడ్డి, ఆలయ సిబ్బంది అర్చకులు పాల్గొన్నారు. తిరువీధుల్లో భక్తులకు దర్శనమిచ్చి, యాగశాలలో హోమం అనంతరం శ్రీవారు ఆలయ ప్రవేశం చేశారు. కల్యాణోత్సవం రోజున ధ్వజస్తంభానికి ఆరోహణం చేసిన గరుడ పతాకాన్ని ఈ సందర్భంగా అవరోహణం చేశారు. శ్రీవారి ఆలయ ప్రవేశంతో ప్రధాన ద్వారాలను మూసివేశారు. శనివారం అన్ని రకాల దర్శనాలను రద్దు చేశారు. ఆదివారం ఉదయం శ్రీవారి దర్శనానికి అనుమతి ఇస్తారు.

తీర్థవాదికి కుంకుమ, గాజులు ప్రత్యేకం

కదిరి నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో కదిరి కుంకుమ, గాజులకు ప్రత్యేకత ఉంది. తీర్థవాది రోజున తిరువీధుల్లో అమ్మే కుంకుమ, గాజులను కదిరి ప్రాంతంలోని ఆడపడుచులు కొనుగోలు చేస్తారు. కుంకుమను సంవత్సరం పొడవునా వాడుకుంటారు. ఇంటికి వచ్చిన ఆడపడుచులకు గాజులు, కుంకుమతో పాటు కదిరి మల్లెలు ఇవ్వడం ఆనవాయితీ.

నేడు పుష్పయాగోత్సవం

ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో ఆదివారం పుష్పయాగోత్సవం జరగనున్నది. దీంతో 15 రోజుల పాటు జరిగిన బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. నిత్య కల్యాణుడైన శ్రీవారికి అన్ని రకాల పుష్పాలు, సుగంధ ద్రవ్యాలతోను యాగోత్సవం నిర్వహిస్తారు. వివిధ పుష్పాలతో యాగోత్సవం నిర్వహించడం ద్వారా స్వామిని ప్రసన్నం చేసుకుంటారు.

ఉమ్మడి జిల్లాలో వడగండ్ల వాన

దెబ్బతిన్న పంటలు



తనకల్లులో వడగండ్ల కుప్ప

తనకల్లు, యాడికి, అనంతపురం అర్బన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో శనివారం వడగండ్ల వర్షం కురిసింది. ఈ నెల ఆరంభం నుంచి ఎండలు మడిపోతున్నాయి. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల వరకూ నమోదయ్యాయి. దీంతో జనం బయటకు రావాలంటే ఆలోచించే పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి వాతావరణంలో శనివారం సాయంత్రం అనూహ్యంగా మార్పు వచ్చింది. ఆకాశం మేఘావృతమై.. ఒక్కసారిగా చల్లటిగాలులు వీచాయి. కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు, మరికొన్నిచోట్ల ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వడగండ్ల వాన కురిసింది.

● తనకల్లు మండల కేంద్రంలో సాయంత్రం 4 గంటల నుంచి సుమారు అరగంటపాటు వడగండ్ల వాన కురిసింది. పట్టణ శివారులోని రమ్మీ కేఫ్ వద్ద యువకులు వడగండ్లను ఏరి పెద్ద కుప్పగా పోశారు. వడగండ్ల వానకు పంటలు తెబ్బతిన్నాయి. తనకల్లుకు చెందిన ఆంజనేయులు రెండు ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంట మొత్తం నేలకొరిగింది. కంకి దశలో పంట ధ్వంసం కావడంతో తనకు రూ.3 లక్షల నష్టం జరిగిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. తనకల్లుకు చెందిన ఆది రెండు ఎకరాల్లో దబ్బ చిక్కుడు సాగుచేశారు. పూత దశలో ఉన్న పంట మొత్తం ధ్వంసమైంది. పూత రాలిపోయి కొమ్మలు మిగిలాయి. తనకు రూ.రెండు లక్షల నష్టం జరిగిందని ఆది ఆవేదన చెందారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

● యాడికి మండలం కేశవరాయునిపేట గ్రామంలో శనివారం సాయంత్రం చిన్నపాటి వడగండ్లవాన కురిసింది. యాడికి, రాయలచెరువు తదితర గ్రామాల్లో సాయంత్రం నుంచి ఆకాశం మేఘావృతమై చల్లటి గాలులు వీచాయి. మోస్తరు వర్షం కురిసింది. నాలుగు రోజులుగా మండలంలో ఉష్ణోగ్రతలు 39 నుంచి 40 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకూ నమోదయ్యాయి. ఇలాంటి పరిస్థితుల్లో వాతావరణం చల్లబడటంతో జనం ఊరట చెందారు.



నేలకూలిన మొక్కజొన్న పంటను చూపుతున్న తనకల్లు రైతు ఆంజనేయులు

● నగరంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. పలు కాలనీలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ప్రజలు చిమ్మచీకట్లో గడపాల్సి వచ్చింది. పెద్దవడుగూరు మండలంలో మోస్తరు వర్షం కురిసింది. వజ్రకరూరు, యల్లనూరు, పుట్లూరు, తాడిపత్రి, గార్లదిన్నె, కూడేరు, నార్పల మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

అభ్యసనం నిరంతర ప్రక్రియ

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల తొలి బ్యాచ్ విద్యార్థి జక్రియబేగ్

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మాట్లాడుతున్న మాజీ ప్రిన్సిపాల్ జక్రియ బేగ్

అనంతపురం సెంట్రల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): అభ్యసనం నిరంతరం ప్రక్రియ అని అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల తొలి బ్యాచ్ విద్యార్థి, మాజీ ప్రిన్సిపాల్ జక్రియ బేగ్ పేర్కొన్నారు. కళాశాల సి-బ్లాక్‌లో మెగా అలుమ్ని అసోసియేషన్ మీట్-2025ను శనివారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి జక్రియబేగ్‌తోపాటు పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జక్రియ బేగ్ మాట్లాడుతూ సాంకేతిక విద్యావ్యవస్థలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. తద్వారా సమాజానికి అవసరమైన ఇంజనీరింగ్ సేవలందించవచ్చునని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల ఆలోచనలు, ఆవిష్కరణలు ప్రస్తుత విద్యార్థులకు అందించేలా కృషిచేస్తున్నామని తెలిపారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ప్రిన్సిపాల్ జక్రియ బేగ్‌తోపాటు ఇతర ప్రిన్సిపాల్స్‌ను, లెక్చరర్లను పూర్వపు విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల విభాగాధిపతులు శ్రీనివాస్‌రావు, ధీరేంద్రబాబు, సుధాకర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, యుగంధర్, అధ్యాపకులు నరసింహులు, మహబూబ్‌బాషా, వెంకట సుబ్బయ్య, సుంకన్న, రాంబాబు, క్రిష్టప్ప, నిత్యలావణ్య, జయశ్రీ, రాధిక, సుధారాణి, సరిత, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

నలుగురు అన్నదమ్ములం ఇక్కడే చదివాం



మా ఇంట్లోని ఐదుగురు అన్నదమ్ముల్లో నలుగురు ఇదే కళాశాలలో పాలిటెక్నిక్ చదివాము. మా పెద్దన్న సివిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా కర్నూలులోని ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో, రెండో అన్న ముంబై భారత్ పెట్రోలియంలో డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా, మూడో అన్న బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌లో ఎయిర్ ఇండియా సంస్థలో పనిచేస్తున్నారు. నేను 1993నుంచి ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాలో వివిధ విభాగాల్లో పని చేస్తున్నా. ఆ విధంగా కెరీర్‌ను బిల్డ్ చేసుకోవడానికి ఈ కళాశాలలో నేర్చుకున్న బేసిక్స్ చాలా దోహదపడ్డాయి. నాణ్యమైన ప్రమాణాలతో కూడిన ఇంజనీరింగ్ నేర్చుకోవడానికి కళాశాల అవకాశం కల్పించింది.

- రాధాకృష్ణ, పూర్వ విద్యార్థి, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

స్నేహపూర్వకమైన ర్యాగింగ్



ఇక్కడ చదువుకునే రోజుల్లో ర్యాగింగ్ బాగా చేశారు. అయితే అది ఇబ్బందికరంగా కాకుండా స్నేహపూర్వకంగా ఉండేది. మా సీనియర్స్ వాళ్ల రూంలో కూర్చోబెట్టి సబ్జెక్టులు చెప్పేవారు. ప్రాజెక్టులు, పరీక్షలు, పైచదువులు ఇలా అన్ని అంశాలను వివరించేవారు. రాష్ట్రంలోని ఐదు పాలిటెక్నిక్ కళాశాలల్లో అనంతపురం కళాశాల ఒకటిగా ఉంది. రాష్ట్రంలో ప్రథమంగా కోర్ బ్రాంచ్‌లు భర్తీ అవుతున్నాయి. ఇక ఆటోమొబైల్ ఇంజనీరింగ్ ఫస్ట్ కాలేజ్. వేలాదిమంది ఇక్కడ చదివి ఉన్నత స్థాయికి వెళ్లాం.

- విజయభాస్కర్, పూర్వ విద్యార్థి, టెక్నికల్ ఎడ్యుకేషన్ స్టేట్ డిప్యూటీ డైరెక్టర్

నిమిషం ఆలస్యమైనా రానిచ్చేవారు కాదు



మానాన్న రామిరెడ్డి మనోరంజన్ 1959లో ఈ కళాశాలలో పాలిటెక్నిక్ చదివి. అనంతరం 30 సంవత్సరాలు ఇంగ్లిష్ లెక్చరర్‌గా ఇక్కడే పని చేశారు. నీరు, చెట్లు అంటే ఆయనకెంతో ఇష్టం. ప్రస్తుతం ఇక్కడ కనిపిస్తున్నవి ఆయన నాటినవే. ఆయన గుర్తుగా దాదాపు రూ.3లక్షల విలువగల రెండు వాటర్ ఫిల్టర్ ట్యాంకులు ఏర్పాటు చేయిస్తున్నా. విద్యార్థిగా నేనూ ఇదే కళాశాలలో చదువుకున్నాను. తరగతి సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా రానిచ్చేవారు కాదు.

- భరత్, పూర్వపు విద్యార్థి

అధినేతలుగా ఎందరో..



ఇక్కడ చదివిన విద్యార్థులు ఎందరో అధికారులుగా, సంస్థల అధినేతలు గా ఎదిగారు. ఇంజనీరింగ్ అంటేనే కంప్యూటర్ అనుకుంటారు. కాని కోర్ బ్రాంచ్‌లైన సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఆటోమొబైల్ వంటి కోర్సులే ఇంజనీరింగ్‌కు పునాదులు. మా బ్యాచ్‌తో పాటు సీనియర్‌లు, జూనియర్లు ఎంతోమంది సొంతంగా సంస్థలు ఏర్పాటుచేసి పలువురికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. కళాశాల లెక్చరర్లు మాకు ఇంజనీరింగ్‌లో గట్టిపునాదులు వేయడంతోనే సమాజంలో రాణించగలుగుతున్నాం.

- రావి చైతన్య కిశోర్, పూర్వవిద్యార్థి


కోర్ ఫండమెంటల్ ఆఫ్ ఇంజనీరింగ్



పాలిటెక్నిక్ అంటే కోర్ ఫండమెంటల్ ఆఫ్ ఇంజనీరింగ్. క్రమశిక్షణ, అభిమానంతో మాకు అధ్యాపకులు పాఠాలు బోధించేవారు. వారందించిన విజ్ఞానం మా జీవితాలను ఉన్నతస్థితికి తీసుకెళ్లింది. మా నాన్న నారాయణస్వామి సీనియర్ ఇన్‌స్ట్రక్టర్‌గా ఈ కళాశాలలో పనిచేశారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకుని ఇక్కడే పాలిటెక్నిక్ చదివా. భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ అయిన డీఆర్‌డీఓలో సైంటిస్ట్‌గా ఉన్నా. అక్కడ మిస్సైల్ సిస్టమ్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నా. మా నాన్న పనిచేస్తున్న ఈ కళాశాలలో చదివి దేశ అత్యున్నత రంగంలో సేవలందించడం గర్వంగా ఉంది.

- కిశోర్, పూర్వ విద్యార్థి, డీఆర్‌డీఓ సైంటిస్ట్

ఇక్కడి నుంచే పునాదులు



1975-78లో మెకానికల్ బ్రాంచ్ చదివా. పోస్ట్ డిప్లొమా ఇన్ డిజైన్‌చేసి డీఆర్‌డీఓలో సైంటిఫిక్ అసిస్టెంట్‌గా పని చేశా. ఐజీఎంజీపీలో మిస్సైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం సేవలందించా. అనంతరం పరిశోధన నుంచి ఉత్పత్తి విభాగానికెళ్లా. ఈ కళాశాలలో గట్టి పునాదులు వేయడంతోనే దేశ స్థాయిలో పని చేయగలిగా. కళాశాల పెట్టిన భిక్ష, అధ్యాపకులు అందించిన విద్య అని చెప్పడానికి గర్వంగా ఉంది.

- పవన్, పూర్వ విద్యార్థి, సైంటిఫిక్ అసిస్టెంట్

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు

- జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఇతర సభ్యులు

అనంతపురం విద్య, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ అధికారులను ఆదేశించారు. జడ్పీలో శనివారం ఏడు స్టాండింగ్ సమావేశాలు నిర్వహించారు. ప్రధానంగా ఆర్‌డబ్ల్యూ ఎస్, పంచాయతీరాజ్, అగ్రికల్చర్, విద్య, బీసీ, సోషల్ వెల్ఫేర్ అంశాలపై చర్చ సాగింది. చర్చ సందర్భంగా బుక్కరాయసముద్రం జడ్పీటీసీ మాట్లాడుతూ తమ మండలానికి సత్యసాయి వాటర్ సప్లై అవుతోందని, అయితే నీళ్ల రంగు మారడం వల్ల, అన్నం కలర్ మారుతోందని సభ దృష్టికి తీసుకొచ్చారు. గోరంట్ల జడ్పీటీసీ మాట్లాడుతూ గోరంట్ల టౌన్, కొత్తపల్లిలో నీటి సమస్య ఉందన్నారు. నార్పల జడ్పీటీసీ సైతం తాగు నీటి సమస్యను సభ దృష్టికి తీసుకొచ్చారు. కణేకల్లు మండల కేంద్రంలోని ఎస్సీకాలనీలో నీటి ఎద్దడి ఉందని జడ్పీటీసీ తెలిపారు. అనంతరం జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడెక్కడ తాగునీటి సమస్య ఉందో గుర్తించాలన్నారు. సమయం వృథా చేయకుండా సమస్య మీ దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీ నుంచి సీనరేజీ చార్జీలు రూ.96 కోట్లు పెండింగ్ ఉన్నాయన్నారు. మున్సిపల్ కమిషనర్లతో మాట్లాడి నిధులు రాబట్టి జడ్పీ ఖాతాకు జమ చేయాలన్నారు. తర్వాత కంబదూరు, నార్పల, కణేకల్లు తదితర మండలాల్లోని పంచాయతీరాజ్ రహదారుల సమస్యలను జడ్పీటీసీ సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. కణేకల్లు జడ్పీ హైస్కూల్‌లో గోడ కూలేలా ఉందని, వెంటనే సమస్య పరిష్కరించాలని జడ్పీటీసీ తెలిపారు. బుక్కరాయసముద్రం మండలంలో కొన్ని స్కూళ్లలో ఎండీఎం సరిగ్గా లేకపోవడంతో 50 శాతం విద్యార్థులు ఇళ్ల నుంచి లంచ్ బాక్సు లు తీసుకెళుతున్నారన్నారు. నాణ్యత పెంచేలా చూడాలని అధికారులను కోరారు. పరిగిలోని ఎస్సీ హాస్టల్ భవనం సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతపురం రూరల్ జడ్పీటీసీ మాట్లాడుతూ కొన్ని ప్రాంతాల్లో రైతు భరోసా కేంద్రాలను పోలీస్‌స్టేషన్లుగా మార్చారని, ఇదేనా రైతులకు ఇచ్చే గౌరవం అంటూ అసహనం వ్యక్తం చేశారు. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు కోడిగుడ్లు సరిగ్గా రావడం లేదన్నారు. ఐసీడీఎస్ పరిధిలో విధులకు డుమ్మా కొట్టే టీచర్లపై చర్యలు తీసుకోవాలని సభ్యులు అధికారులను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యం

- చిరుధాన్యాల పండుగలో వక్తలు



కార్యక్రమంలో పాల్గొన్న పూర్వపు కలెక్టర్ జనార్దన్‌రెడ్డి

అనంతపురం క్లాక్ టవర్, మార్చి 22(ఆంధ్ర జ్యోతి): ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యం సాధ్యమవుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. మన వ్యవసాయం, పంటలు, ఆరోగ్యం అనే నినాదంతో ముందుకుసాగుదామని పిలుపునిచ్చారు. స్వచ్ఛంద సంస్థలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో కలిసి అనంత సుస్థిర వ్యవసాయ వేదిక ఆధ్వర్యంలో స్థానిక ఆర్ట్స్ కళాశాల ఎదురుగా పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌లో మూడు రోజుల పాటు సాగే చిరుధాన్యాల పండుగ (మిల్లెట్ ఫెస్టివల్)ను పలువురు విశ్రాంత ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. రైతులు ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా పూర్వపు కలెక్టర్ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో నేలలకు అనుకూలమైన వాటిని పండించడమే కాకుండా పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు స్థానికంగా పండించిన పంటలను తినాలని తెలిపారు. మాజీ ఐఏఎస్ అధికారి, ఎన్ఐఆర్‌డీ డైరెక్టర్ జనరల్ డబ్ల్యూఆర్ రెడ్డి, జమ్మూకాశ్మీర్ మాజీ డీజీపీ గోపాల్‌రెడ్డి, ఏపీ మాస్ సీఈఓ సీఎస్ రెడ్డి ప్రకృతి వ్యవసాయంపై తమ అనుభవాలు, ప్రజల ఆరోగ్యంపై ప్రభావాన్ని వివరించారు. ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ మల్లారెడ్డి మాట్లాడుతూ.. రైతు సమస్యలకు, ప్రజలకు ఎదురయ్యే ఆరోగ్య సమస్యలన్నింటికీ సహజ వ్యవసాయమే దివ్య ఔషధమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ నరసింహారావు, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, నాబార్డు సీజీఎం మోహనయ్య, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు విజయరామ్, భానుజా, తిరుమల నాయక్, కిష్టప్ప, రమేష్ సుసార్ల పాల్గొన్నారు.

వ్యాపారి నగదుతో డ్రైవర్ పరార్

కంబదూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేళ్లకుంట గ్రామానికి చెందిన వేరుశనగ వ్యాపారి సుధాకర్‌కు చెందిన రూ.5.80 లక్షల నగదును అతడి డ్రైవర్ తీసుకుని పరారయ్యాడు. ఈ మేరకు వ్యాపారి కంబదూరు ఎస్ఐ ప్రవీణ్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. ఐషర్ వాహనంలో ఉన్న నగదును డ్రైవర్ దుర్గప్రసాద్ తీసుకుని పరారయ్యాడని పేర్కొన్నారు. వాహనంలో ఉన్న నగదును గమనించిన డ్రైవర్ నగదును తీసుకొని వేరేవ్యక్తి ద్విచక్రవాహనంలో పరారయ్యాడని తెలిపారు. ఈ మేరకు ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెడ్ క్రాస్ కార్యాలయంలో అగ్నిప్రమాదం

రూ.10 లక్షల ఆస్తి నష్టం

అనంతపురం న్యూటౌన్/టౌన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పాతూరు చెన్నకేశవ స్వామి ఆలయ సమీపంలోని రెడ్ క్రాస్ సొసైటీ కార్యాలయంలో శనివారం అగ్నిప్రమాదం జరిగింది. భవనం నుంచి ఉదయం 8 గంటల సమయంలో భారీగా మంటలు ఎగసిపడ్డాయి. దీంతో స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అప్పటికే కార్యాలయంలో రికార్డులు, ఫ్రిజ్‌లు ఇతర వస్తువులు దగ్ధమయ్యాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందని స్థానికులు, నిర్వాహకులు చెబుతున్నారని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని జిల్లా అగ్నిమాపక శాఖ సహాయ అధికారి లింగమయ్య తెలిపారు. ఈ ప్రమాదంతో రూ.10లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని రెడ్‌క్రాస్ సంస్థ మేనేజరు మోహన్‌క్రిష్ణ తెలిపారు.



షార్ట్‌సర్క్యూట్‌తో రెడ్‌క్రాస్‌లో చెలరేగిన మంటలను ఆర్పుతున్న ఫైర్‌సిబ్బంది

వృద్ధురాలి మృతి

అనంతపురం క్రైం/న్యూటౌన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని రెవెన్యూ కాలనీ షిరిడీ నగర్‌లో గ్యాస్ లీకేజీ కారణంగా మంటలు చెలరేగి లక్ష్మీదేవి(75) అనే వృద్ధురాలు మృతిచెందారు. భవంతి రెండో అంతస్తులో ఆమె ఒక్కరే ఉండటం, లోపల గడియ పెట్టుకోవడంతో కాపాడటం స్థానికులకు సాధ్యం కాలేదు. సమాచారం అందుకున్న జిల్లా అగ్నిమాపక శాఖ సహాయ అధికారి లింగమయ్య సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. తలుపులను బద్దకొట్టించి లోపలికి వెళ్లారు. అప్పటికే ఆమె మృతి చెందారు. ఈ ప్రమాదంలో ఇంట్లో వస్తువులు కాలిపోవడంతో రూ.లక్ష వరకు ఆస్తి నష్టం జరిగిందని అధికారులు అంచనా వేశారు. లక్ష్మీదేవి ఆర్డీటీ ఆసుపత్రిలో నర్సుగా పని చేసి ఉద్యోగ విరమణ పొందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సర్వజన వైద్యశాలకు తరలించారు.

సీసీ టీవీ కోర్సులకు ఆహ్వానం

బుక్కపట్నం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడ్‌యాప్ సంయుక్తంగా నిర్వహిస్తున్న సీసీ టీవీ ఇన్‌స్టలేషన్ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మగ్బుల్ హుస్సేన్, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరిక్రిష్ణ తెలిపారు. శనివారం వారు మండల కేంద్రంలోని డిగ్రీకళాశాలలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. డిగ్రీ కళాశాలలో డిగ్రీ, ఇంటర్, ఐటీఐ, పాస్, ఫెయిల్ అయిన విద్యార్థులు కోర్సు నేర్చుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. మూడు నెలల శిక్షణ అనంతరం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఆసక్తిగల యువతి, యువకులు ఆధార్ లింక్ కలిగిన ఫోన్ ద్వారా దరఖాస్తు చేస్తుకోవాలన్నారు. వివరాలకు సిల్క్‌హట్ కోఆర్డినేటర్ సెల్ నంబర్ 7981541994కు సంప్రందించాలన్నారు.

కార్మికులపై దాడి సహించరానిది

సీపీఐ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్

అనంతపురంరూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): చమటోడ్చి పని చేసే కార్మిక వర్గంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముప్పేట దాడి చేస్తున్నాయని, ఇది సహించరానిదని సీపీఐ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ అన్నారు. మండలంలోని మన్నీల గ్రామ సమీపాన శ్రీకృష్ణా గార్డెన్స్‌లో నిర్వహిస్తున్న ఏఐటీయూసీ రాజకీయ శిక్షణ తరగతుల ప్రారంభోత్సవం కార్యక్రమానికి శనివారం ఆయన హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి రాజారెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నా రు. అంతకుముందు ఏఐటీయూసీ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నాయని మండిపడ్డారు. సమాజంలో కార్మికులను చిన్న చూపుచూస్తున్నారని కొన్ని మీడియా సంస్థలు కూడా కార్పొరేట్ సంస్థలకు వంతు పాడుతున్నాయని ఆవేదన చెందారు. ఆంధ్ర రాష్ట్రంలో తక్కువ వేతనానికి పనిచేయడానికి ఇతర రాష్ట్రాల నుండి కార్మికులను రప్పిస్తున్నారని ఇక్కడ నైపుణ్యం కలిగిన కార్మికులకు పనిదొరకడం లేదన్నారు. కాలానుగుణంగా కార్మికులకు హక్కులు, బాధ్యతలు గుర్తు చేస్తూ సమాజానికి తోడ్పాటు అందించేందుకు ఇలాంటి శిక్షణలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, నారాయణ స్వామి, మల్లికార్జున, చలసాని రామారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జగదీష్

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆదివారం సాయంత్రం	సహర్ సోమవారం ఉదయం
కదిరి:	6.31	5.04
ధర్మవరం:	6.36	5.04

న్యూస్ బాక్స్

పీఎం, సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం



పీఎం, సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఓబుళదేవరచెరువు, మార్చి22 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించినందుకు శనివారం పీఎం నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు ఎమ్మార్పీఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంపై వారు స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో సంబరాలు చేసుకున్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు ఇనగలూరు లక్ష్మణ, నాగేళ్ల బావన్న, కత్తి ఆనంద్, పలక గంగన్న, శ్రీనివాసులు, ఎర్రదొడ్డెప్ప, ఎర్రదొడ్డి లక్ష్మీపతి, చౌడప్ప, రామాంజి, నరేష్, నవాబుకోట రమణ, వెంకటేష్, జయరాం పాల్గొన్నారు.

కనీస అవసరాలు తీర్చలేని ప్రభుత్వాలెందుకు?



మురుగు కాలువను పరిశీలిస్తున్న సీఐటీయూ నాయకులు

ధర్మవరం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ప్రజల కనీస అవసరాలు కూడా తీర్చలేని ప్రభుత్వాలెందుకని సీపీఐ నాయకులు విమర్శించారు. మున్సిపాలిటీ పరిధిలోని వైఎస్ఆర్‌కాలనీలో నెలకొన్న సమస్యలపై శనివారం సీఐటీయూ నాయకులు పర్యటించారు. సీపీఎం నాయకులు ఆలుకుంట్ల మారుతి, వీస్‌హెచ్‌బాషా, సీఐటీయూ అయూబ్‌ఖాన్, గుంపుహరి మాట్లాడుతూ కాలనీ ఏర్పడి 20 సంవత్సరాలైనా ఇంతవరకు కనీస అవసరాలైన రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థ, వీధిలైట్లు పదిరోజులకు ఒకసారి కూడా తాగునీరురాని పరిస్థితి ఏర్పడిందన్నారు. మున్సిపాలిటీ అధికారులుకానీ, ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకోలేదన్నారు. కమిషనర్ కాలనీలో పర్యటించి సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. నాయకులు ఖాదర్‌బాషా, హైదర్‌వలీ, వెంకటస్వామి, మహబూబ్‌పీరా పాల్గొన్నారు.

వీఆర్‌ఓలకు ఉద్యోగోన్నతులు కల్పించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న వీఆర్‌ఓలు

పుట్టపర్తిటౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హులైన వీఆర్‌ఓలు అందరికీ ఉద్యోగోన్నతులు కల్పించాలని జిల్లా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు శనివారం కలెక్టర్ టీఎస్ చేతన్‌కు వినతిపత్రం అందించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మధునాయక్, తాలుకా అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి ఆధ్వర్యంలో పలువురు వీఆర్‌ఓలు కలెక్టర్‌ను కలిసి రెవెన్యూశాఖలో ఖాళీగా ఉన్న సీనియర్, జూనియర్ అసిస్టెంట్ల పోస్టులను అర్హులైన ఉద్యోగులతో భర్తీ చేయాలన్నారు. గ్రామ రెవెన్యూ అధికారులను గ్రేడ్ 1, 2 రద్దు చేయాలని కోరారు. సచివాలయాల విలీనాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. అలాగే ప్రభుత్వం చేపడుతున్న క్లస్టర్ విధానంపై హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆంజనేయులు, అశోక్‌కుమార్, నజీర్ అహమ్మద్, అనిల్‌కుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు కనీస వేతనం చెల్లించాలి



డీఎంహెచ్‌ఓకు వినతి పత్రం ఇస్తున్న ఆశా వర్కర్లు

పుట్టపర్తి రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఆశాకార్యకర్తలకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సౌభాగ్య డిమాండ్ చేశారు. శనివారం జిల్లాకేంద్రంలోని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజ్‌బేగంను కలిశారు. ఆశావర్కర్లకు కనీసం వేతనం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు మంజుల, సహాయ కార్యదర్శి చెన్నక్రిష్ణమ్మ ముత్యాలమ్మ పాల్గొన్నారు.

హంద్రీనీవా కాలువ వెడల్పు చేయాలి



హంద్రీనీవా కాలువను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

బుక్కపట్నం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులను వెంటనే నిలిపివేసి, కాలువనువెడల్పు చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హరి డిమాండ్ చేశారు. శనివారం మండలకేంద్రంలో హంద్రీనీవా కాలువలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గతంలో మూడువేల క్యూసెక్కులు ప్రవాహం ఉండేదని, లైనింగ్ పనులు చేస్తే, నీటి ప్రవాహ సామర్థ్యం తగ్గిపోతుందన్నారు. భూగర్భజలాలు సైతం తగ్గుతాయన్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ కాలువలోని పిచ్చి మొక్కలు తొలగించి వెడల్పు చేయాలన్నారు. సత్యసాయి జిల్లాలో అన్ని చెరువులను నీటితో నింపి సాగు, తాగునీటికి ఇబ్బందిలేకుండా చూడాలన్నారు. లైనింగ్ పనులతో రైతులకు నష్టమేకానీ లాభంలేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, కాలువను వెడల్పు చేయాలని కోరారు. ఆయనతోపాటు సీఐటీయూ కుళ్లాయప్ప, సిద్ధ పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారి నిర్లక్ష్యం..!

- భూ సమస్యలు పరిష్కారంకాక రైతుల అవస్థలు
- గాండ్లపెంటకు వెళ్లాల్సిన పరిస్థితి
- ఆ అధికారి మాకొద్దంటున్న గొడ్డువెలగల ప్రజలు



గాండ్లపెంట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ అధికారిని నియమించింది. అయితే ఆ అధికారి మాత్రం తన విధులను మరిచి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గొడ్డువెలగల గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మండలంలోని గొడ్డువెలగల రెవెన్యూ గ్రామంలో భూ సమస్యలు ఉన్నాయి. సమస్యల పరిష్కారం కోసం స్థానిక సచివాలయం వద్దకు వెళితే రెవెన్యూ అధికారి జయరాం అందుబాటులో ఉండటం లేదని రైతులు వాపోతున్నారు. ప్రతి పని రెవెన్యూ అధికారులతో ముడిపడి ఉంటుంది. అలాంటి అధికారి విధులకు సక్రమంగా హాజరుకాకపోతే సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఆయనను ఫోన్‌లో ప్రందించాలంటే అది పనిచేయదు. ప్రతి పనికి మండల కేంద్రం గాండ్లపెంటకు రావాలంటే ఇటు కదిరి రూరల్ మండలంలోని కుమ్మరవాండ్లపల్లికి వచ్చి 25 కి.మీ ప్రయాణం చేయాల్సి ఉంది. లేదంటే తుమ్మలబైలు, కటారుపల్లి మీదుగా చేరుకోవాలంటే 15 కి.మీ దూరం ప్రయాణించాలి. ఎంతో వ్యయప్రసాలకు ఓర్చి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుంటే, పలుమార్లు అధికారులు తిప్పుకుంటున్నారని ఆవేదన చెందుతున్నారు. ఏ పని జరగాలన్నా ఆ అధికారి తడపాల్సిందేనని ప్రజలు అంటున్నారు. లేదంటే గ్రామస్థులపై చిందులు వేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికితోడు చౌకధాన్యపు వస్తువుల పంపిణీ అస్తవ్యస్తంగా ఉన్నా ఆ అధికారి జోక్యం చేసుకోకపోవడంతో పక్కదారి పట్టిన సంఘటనలు కోకొల్లలు. నాలుగురోజుల క్రితం మాజీ సర్పంచ్ ప్రసాద్ భూ సమస్యపై వీఆర్‌ఓ వద్దకు వెళ్లితే, వాగ్వాదం చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ విషయంపై తహసీల్దార్‌కు కూడా ఫిర్యాదు చేశారు. ప్రజాసమస్యలు పట్టించుకోని వీఆర్‌ఓ తమకు అవసరం లేదంటూ తహసీల్దార్‌కు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు.

ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లాం
- బాబూరావు, తహసీల్దార్

ఇటీవల వీఆర్‌ఓపై వచ్చిన ఫిర్యాదులను ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లాం. ఆయన ఆదేశాల మేరకు వీఆర్‌ఓపై చర్యలు తీసుకుంటాం.

విధుల్లో నిర్లక్ష్యం



గొడ్డువెలగల వీఆర్‌ఓ జయరాం విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. తాము సాగుచేసుకుంటున్న ప్రభుత్వ భూమిని పట్టా చేయించాలని పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగా. పట్టాలకోసం 3 వేలు ఇవ్వాలని ఆ అధికారి డిమాండ్ చేశారు. పని చేస్తానని పలుమార్లు గాండ్లపెంట కార్యాలయం చుట్టూ తిప్పుకున్నారు. దీనిపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు.

- బయ్యప్ప, వీరనగట్టుపల్లి

ప్రజాసమస్యలు పట్టించుకోండి



ప్రజా సమస్యలు పరిష్కరించడానికి రెవెన్యూ అధికారిని నియమించారు. అయితే ఆయన పట్టించుకోవడం లేదు. వివిధ సమస్యల కోసం సచివాలయానికి వెళితే అందుబాటులో ఉండరు. మండల కేంద్రంలోని తహసీల్దార్‌కార్యాలయానికి పలుమార్లు తిరిగి సమస్యలు పరష్కరించుకోవాల్సి వస్తోంది. అన్నదమ్ముల భూ సమస్య కోసం వెళితే నిబంధనల పేరుతో కాలయాపన చేస్తున్నారు. వ్యవసాయం చేసుకుని జీవనం సాగించే తమకు రెవెన్యూ సమస్యలు తలనొప్పిగా మారాయి.

- కుమార్‌స్వామి, నర్సప్పగారిపల్లి

సజావుగా సర్వసభ్య సమావేశం

తాడిమర్రి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలసర్వసభ్య సమావేశం శనివారం సజావుగా సాగింది. ఎంపీపీ భువనేశ్వరరెడ్డి ఆధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు గడచిన మూడు నెలల కాలంలో వారి శాఖల పరిధిలో జరిగిన అబివృద్ధి పనులను చదివి వినిపించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మాట్లాడుతూ తాగునీటి సమస్య ఎక్కడైనా ఉంటే ఆ గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తామన్నారు. ఎంపీడీఓ రంగారావు, తహసీల్దార్ భాస్కర్ రెడ్డి, ఎంఈఓ క్రిష్ణమోహన్, ఏఓ రమాదేవి, ఇతర శాఖల అధికారులతో పాటు జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్, కూచి రాము, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

గాండ్లపెంట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం నిర్వహించాల్సిన సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడినట్లు ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి తెలిపారు. సమావేశం ఆదివారం నిర్వహిస్తామన్నారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్నిశాఖలాధికారులు హాజరుకావాలన్నారు. అబివృద్ధి పనులపై సమీక్షిస్తామన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి

కదిరిఅర్బన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): వలసలు నివారించి, ఉపాధి పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కదిరప్ప శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా 42వేల మంది ఉపాధి కూలీలు ఉన్నారన్నారు. అందరికీ పనులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. పనులు చేసి పదివారాలవుతున్నా కూలీలకు రావాల్సిన డబ్బులు ఇప్పటికీ అందలేదన్నారు. కూలీలకు రోజు వేతనం రూ.700 పెంచి, జాబ్‌కార్డులున్నవారికి పనులు కల్పించాలన్నారు. పనిప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలన్నారు.

25న కదిరిలో మెగా జాబ్‌మేళా

పుట్టపర్తిటౌన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 25న కదిరిలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరిక్రిష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కదిరి బ్లూమూన్ కళాశాలలో నిర్వహించనున్న జాబ్‌మేళాలో 25 బహుళజాతి కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. జిల్లాలోని నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తారని అన్నారు. పది నుంచి డిగ్రీ, బీటెక్, డిప్లొమా చేసిన 35లోపు యువతీయువకులు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి రూ.10వేల నుంచి రూ.40వేల వరకు వేతనం ఉంటుందన్నారు. వివరాలకు.. 9390176421, 9182288465 నంబర్లలో సంప్రందించాలన్నారు.

ఎస్సీ వర్గీకరణతో మాలలకు నష్టం



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మాలమహానాడు నాయకులు

కదిరిఅర్బన్, మార్చి22 (ఆంధ్రజ్యోతి): ఎస్సీవర్గీకరణతో మాలలకు నష్టం వాటిల్లితుందని మాలమహానాడు నాయకులు పేర్కొన్నారు. శనివారం వర్గీకరణను వ్యతిరేకిస్తూ అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రిజర్వేషన్ ఫలాలు మాలలకు దక్కకుండా చేయాలని కక్షపూరితంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. వర్గీకరణతో మాలలకు అన్యాయం జరుగుతుందన్నారు. దీనిపై ప్రభుత్వాలు పునరాలోచించాలన్నారు. పిచ్చల రామచంద్ర, శ్రీనాథ్, మధుసూదన్, త్యాగరాజు, సూర్యనారాయణ, ప్రసాద్ పాల్గొన్నారు.

రైతు విశిష్ట సంఖ్య నమోదు పరిశీలన

కదిరి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగాన్ని ఆధునికీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూనిక్ ఐడీ(రైతు విశిష్ట సం ఖ్య) నమోదు కార్యక్రమాన్ని తలుపుల ఎఓ షాదాబ్ శనివారం పరిశీలించారు. తలుపుల మండలంలోని ఓదులపల్లి, కుర్లి, ఉడమలకుర్తిలో రైతు సేవా కేంద్రాల్లో జరుగుతున్న యూనిక్ ఐడీ నమోదును పరిశీలించారు.

విద్యుత్ రాయితీపై అదనపులోడు క్రమబద్ధీకరణ

● ఏడీ లక్ష్మీనరసింహారెడ్డి

ధర్మవరంరూరల్, మార్చి22(ఆంధ్రజ్యోతి) :గృహవినియోగదారులకు అదనపులోడు క్రమబద్ధీకరణకు ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి సూచనమేరకు రాష్ట్ర ప్రభుత్వం 50శాతం రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ధర్మవరం విద్యుత్‌శాఖ ఏడీ లక్ష్మీనరసింహారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెరిగిన విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామ, మండలకేంద్రాలు, పట్టణ పరిధిలోని 3కిలోవాట్లకు దరఖాస్తు చేసుకునేలా ముందుగానే సంబంధిత విద్యుత్ అధికారులు వినియోగదారులకు సూచించినట్లు తెలిపారు. అదనపులోడు అంటే కొత్తగా కనెక్షన్ తీసుకునే సమయంలో గృహోపకరణాల వినియోగాన్ని అంచనా వేసి కిలోవాట్లలో లెక్కిస్తామని తెలిపారు. ఈ మేరకు డెవలప్‌మెంట్ చార్జీలు సెక్యూరిటీ డిపాజిట్ వసూలు చేస్తారన్నారు. గ్రామ, మండల కేంద్రాల్లో కనీసం రెండు సింగల్‌వాట్లు, పట్టణాల్లో 3 కిలోవాట్లు ఉంటుందన్నారు. ఈ అవకాశం జూన్30వరకు ప్రభుత్వం కల్పించిందన్నారు. దరఖాస్తు కోసం ఆన్‌లైన్ లేదా విద్యుత్ కార్యాలయాలలో అందుబాటులో ఉంటాయని తెలిపారు.

సొమ్ము రికవరీకి ఆదేశం

ముదిగుబ్బ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులపై 18వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో శనివారం నిర్వహించారు. డ్వామా ప్రొసీడింగ్ అధికారి శివశంకర్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు మండలంలోని 25 పంచాయతీల్లో జరిగిన వివిధ పనులపై నివేదికను చదివి వినిపించారు. మొత్తం 647 పనులకు గాను ఎన్ఆర్‌జీఎస్, పంచాయితీరాజ్, అటవీ శాఖ, సర్వశిక్ష అభియాన్ విభాగాలకు సంబంధించి రూ.15,88,16,372 ఖర్చు చేశారు. వీటిలో రూ.7,42,245లక్షలు అవకతవకలు జరిగినట్లు అధికారులు నిర్ధారించి సొమ్మును రికవరీకి ఆదేశించినట్లు తెలిపారు. ఎంపీడీవో దివాకర్, ఎంపీపీ ఆదినారాయణ యాదవ్, ఏఈవో నాగేశ్వరరావు, అంబుడ్స్‌మెన్ శివారెడ్డి, ఏపీడీ చలపతి పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు తవ్వించండి

బత్తలపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు తన పొలంలో ఇంకుడు గుంత తవ్వించి భూగర్భ జలాలు పెంచుకోవాలని డ్వామా పీడీ విజయేంద్ర ప్రసాద్ సూచించారు. మండలంలోని మాల్యవంతం గ్రామంలో శనివారం ఉపాధి హామీ పథకం ద్వారా ఇంకుడు గుంతలు తవ్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు తనపొలంలో వర్షపు నీరు వచ్చే ప్రదేశంలో ఇంకుడు గుంత తవ్వించుకుంటే వర్షపు నీరు ఇంకి భూగర్భ పెంపొందుతాయన్నారు. రైతులు తమ పొలాల్లో పంటలు సాగు చేసుకునేందుకు వీలుంటుందన్నారు. కార్యక్రమములో ఏపీ ఆదెప్ప, టీడీపీ కన్వీనర్‌నారాయణరెడ్డి పాల్గొన్నారు.

బెట్టింగులు వద్దు.. జీవితమే ముద్దు

తనకల్లు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కంటి క్రాస్ నుంచి బాలసముద్రం ఎంపీటీసీ అమర్‌కార్తికేయ ఆధ్వర్యంలో యువకులు తనకల్లు వరకు శనివారం ర్యాలీ చేశారు. బెట్టింగ్ వద్దు జీవితమే ముద్దు అంటూ నినాదాలు చేశారు. బెట్టింగ్‌ల వల్ల ఇప్పటికే ఎంతోమంది యువత అప్పులపాలైనట్లు చెప్పారు. బెట్టింగ్‌ల కారణంగా కొంత మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు.

విధులకు రాని సచివాలయ సిబ్బంది



ఉదయం 11 గంటలైనా ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

నంబులపూలకుంట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో సచివాలయాలు 1, 2 ఉన్నాయి. ప్రతి రోజు సచివాలయానికి వివిధ పనుల మీద వచ్చే ప్రజలకు సేవలందించడానికి అధికారులు ఉదయం 10గంటలకు హాజరుకావాల్సి ఉంది. శనివారం సచివాలయం తలుపులు తెరిచారేకానీ, అధికారులు లేకపోవడంతో పనులకు వచ్చిన ప్రజలు చేసేదిలేక వెనుతిరిగారు. 11గంటలకు విలేజీ హర్టికల్చర్ అసిస్టెంట్ యుగంధర్ వచ్చారు. దీనిపై ఈఓఆర్డీ మాధవరెడ్డిని వివరణ కోరగా సచివాలయ సిబ్బందికి 9 సర్వేలు నిర్వహించాలని ప్రభుత్వం సూచించిందని, అందరూ క్షేత్రస్థాయిలోకి వెళ్లినట్లు తెలిపారు.

రహదారి నిర్మాణానికి స్థల పరిశీలన



భూమిని పరిశీలిస్తున్న సర్వేయర్, టీడీపీ నాయకులు

కొత్తచెరువు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీసీ కాలనీ సమీపంలో 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం పేదలకు కొండ సమీపంలో ఎల్1,ఎల్ 2లేఔట్ల కింద ఇంటి పట్టాలను పంపిణీ చేసింది. ఆ లేఔట్లకు వెళ్లేందుకు రహదారిని కొందరు వ్యక్తులు అడ్డగించడంతో సమస్యగా మారింది. ఆ కాలనీలప్రజలు జనవరి 27న నిర్వహించిన ఆంధ్రజ్యోతి అక్షరమే అండగా...పరిష్కారమే అజెండాగా అనే కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లెసింధూరారెడ్డికి, మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డికి విన్నవించుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే ఆ కాలనీలకు వెళ్లేందుకు రహదారి కోసం ఎవరు ఇబ్బందులు పెడుతున్నారు అది ప్రభుత్వ భూమా లేదా పట్టా భూమి అని పరిశీలించి రహదారి కోసం స్థలాన్ని సేకరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో టీడీపీ నాయకులు, రెవెన్యూ అధికారులు శనివారం లేఔట్లలో పర్యటించి మండల సర్వేయర్ సురేశ్ స్థలాన్ని పరిశీలించి ఇది ప్రభుత్వ భూమి అని, గతంలో కొందరికిపట్టాలు ఇచ్చారని ఆ రైతులకు నోటీసులు అందజేసి రహదారి సమస్యను పరిష్కస్తామని సర్వేయర్ తెలిపారు. టీడీపీ నాయకులు శ్రీనివాసులు, ఒలిపిశీన కాలనీ వాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి పురుషోత్తంగౌడ్

పేదరికం లేని సమాజానికే పీ4 సర్వే

ధర్మవరం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజ స్థాపనకు పీ4 సర్వేను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి పురుషోత్తంగౌడ్, 25వ వార్డు ఇన్‌చార్జ్ భీమనేని ప్రసాద్‌నాయుడు అన్నారు. 25వ వార్డులో పీ4 యాప్ ద్వారా సర్వే పూర్తి చేసుకున్న ఉద్యోగులతో వార్డు సచివాలయంలో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఇంటింటికి తిరిగి చేసిన సర్వే నిర్వహణలో ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. 24వ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ మాధవరెడ్డి ఆధ్వర్యంలో కూడా పీ4 సర్వేపై సమావేశాన్ని నిర్వహించారు. నాయకులు చీమలరామాంజి, బీజేపీ నాయకులు శారాదమ్మ, జనసేన మల్లన్న, కోలానాగార్జున, అఖిల్, సచివాలయ సిబ్బంది సాయిప్రకాశ్, పుష్పరాజ్, ఉమాదేవి, సరిత, నరేంద్ర, ఉదయ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్, ఎస్ఐ

నంబులపూలకుంట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ దేవేంద్రనాయక్ హెచ్చరించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రభుత్వ భూముల రక్షణపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించారు. అటవీ, దేవాదాయ, నీటి పారుదల, పోలీస్ అధికారులు హాజరైయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి సంబంధించిన రెవెన్యూ, అటవీశాఖ, దేవాదాయ, నీటి పారుదల, గ్రామకఠం, భూముల ఆక్రమణలకు పాల్పడితే వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేయాల్సి వస్తుందన్నారు. చెరువు ఆక్రమణలకు పాల్పడితే చెరువులు నిండిన సమయంలో ముంపునకు గురవుతాయన్నారు. ఈఓఆర్డీ మాధవరెడ్డి, ఎస్ఐ వలీబాషా, ఆర్ఐ శ్రీధర్, వీఆర్‌ఓలు, ఇరిగేషన్ రమేష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మండల పూజ



కోదండ రామస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

ఓబుళదేవరచెరువు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడంపల్లిలో వెలసిన కోదండరామాలయంలో శనివారం స్వామివారికి మండల పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు పంచరత్న సురేష్‌శర్మ సీతా, రామ, లక్ష్మణ, భరత, ఆంజనేయస్వామి విగ్రహాలకు పాలాభిషేకం చేసి, పుష్పాలంకరణ, కలశస్థాపన, నవగ్రహ పూజ, గణపతి, వాస్తు హోమాలు నిర్వహించారు. పురోహితుడు హర్షవర్ధన్‌తోపాటు భక్తులు పాల్గొన్నారు.

నేడు ఇఫ్తార్ విందు

కదిరి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షాలీమార్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇస్తున్నట్లు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాయంత్రం ఇచ్చే విందులో ముస్లింలు పాల్గొనాలని కోరారు.

కవి అమర్‌నాథ్‌కు సన్మానం

బత్తలపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాల్యవంతం గ్రామానికి చెందిన కవి అమర్‌నాథ్‌ను శనివారం అనంతపురంలోని ఉపాధ్యాయ భవన్‌లో సన్మానించారు. ప్రపంచ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకుని కవి సమ్మేళనం నిర్వహించారు. కవి అమర్‌నాథ్ రచించిన నా ఘోష నాభాష నా యాస నా శ్వాస అంటూ రాసిన కవితకు శాంతినారాయణ చేతుల మీదుగా అమర్‌నాథ్ దంపతులు అవార్డు అందుకున్నారు.

న్యూస్ బాక్స్

చిన్నారులపై హింసను నిర్మూలిద్దాం

డీఎస్పీ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

పెనుకొండ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పసిపిల్లలపై హింసను నిర్మూలిద్దామని డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీడీపీఓ శాంతలక్ష్మి అన్నారు. ఆర్డీఓ కార్యాలయంలోని సమావేశ భవనంలో మహిళా శిశుసంక్షేమశాఖ మిషన్ వాత్సల్య, డీసీపీయు చిల్డ్రన్స్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశంలో డీఎస్పీ, సీడీపీఓలు మాట్లాడుతూ బాల్య వివాహాల నిలుపుదల, శిశు సంరక్షణపై మహిళా పోలీసులకు, పంచాయతీ కార్మికులకు వివరించారు. పిల్లల విషయంలో మొబైల్, సినీ పరిశ్రమ అత్యంత ప్రధానంగా ప్రభావితం చూపుతున్నాయని, వాటిపై చిన్నపిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా బాలికలు లైంగిక వేధింపులకు గురికాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సమావేశంలో ఓ డీసీపీఓ మహేష్, చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ కొండప్ప, ప్రొటెక్షన్ ఆఫీసర్ మురళీధర్, సోషల్ వర్కర్ వనజాక్షి, శిశుగృహ మేనేజర్ సునీత, లక్ష్మీ ప్రసన్న, పవన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పట్టణ పర్యటన

మడకశిరటౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు శనివారం మడకశిరలో పర్యటించారు. ప్రజల సమస్యలను తెలుసుకొన్నారు. అనంతరం త్వరలో ప్రారంభం కానున్న సింహగిరి సాయి రెస్టారెంట్‌ను పరిశీలించారు. మున్సిపల్ కార్యాలయంతోపాటు, ఐసీడీఎస్ కార్యాలయానికి వెళ్లి అంగన్‌వాడీ ఉద్యోగులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆర్అండ్‌బీలో జరిగిన రివ్యూ మీటింగ్‌లో పాల్గొన్నారు.


రెస్టారెంట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

అనుమానాస్పద మృతి

పరిగి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం యశ్వంతపుర వాసి శనివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పరిగి ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రంలోని జయమంగళి నది వద్ద యశ్వంతపురకు చెందిన జగదీశ్(27) మృతదేహం లభ్యమైంది. సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి సమీపంలో కూల్‌డ్రింక్ బాటిల్, పురుగుల మందు బాటిళ్లు ఉన్నాయి. ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. పూర్తి వివరాలు దర్యాప్తులో తేలాల్సి ఉందని ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

విద్యార్థులకు అండగా హుండాయ్

పెనుకొండ టౌన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తుకు అండగా హుండాయ్ కంపెనీ ఉందని ఆ కంపెనీ ప్రతినిధులు పేర్కొన్నారు. శనివారం వారు మాట్లాడుతూ రూ. 36 లక్షలతో సీఎస్ఆర్ నిధులతో స్కూలు భవనం నిర్మించామని, అందులో విద్యార్థులకు అవసరమైన సామగ్రి ఏర్పాటు చేశామన్నారు. స్కూలు భవనాన్ని ప్రారంభించేందుకు రావాలని మంత్రి సవితను కంపెనీ ప్రతినిధులు టీడీపీ కార్యాలయానికి వెళ్లి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేశవయ్య, పోతిరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, సోము, తదితరులు పాల్గొన్నారు.


మంత్రిని ఆహ్వానిస్తున్న సిబ్బంది

నాటుసారా నిర్మూలనపై అవగాహన


పోస్టర్లను ప్రదర్శిస్తున్న ఎక్సైజ్ అధికారులు

గోరంట్ల, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని గడ్డంతండాలో ఎక్సైజ్ అధికారులు నవోదయం కార్యక్రమం ద్వారా నాటుసారా నిర్మూలనపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. నాటుసారా తాగడం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూనే తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పెనుకొండ, పుట్టపర్తి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు సుజనబాబు, నాగరాజు, ఎస్ఐలు రాజశేఖర్, విజీరాముడు, సర్పంచ్ వాసునాయక్, గ్రామపెద్దలు శ్రీరామనాయక్, పీటినాయక్, గోవిందునాయక్, రూప్లేనాయక్, వెంకటేషనాయక్ తదితరులున్నారు.

'కమిటీలు ఏర్పాటు చేయండి'

పెనుకొండ టౌన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): కుటుంబ సాధికార సారథి కమిటీల నియామకం త్వరలో ఏర్పాటు చేయాలని కన్వీనర్ శ్రీరాములు కోరారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో టీడీపీ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రకారం ప్రతి 60మందిలో ఒక పురుషుడు, మహిళను బూత్‌ల వారీగా నియామకం చేయాలన్నారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నారాయణస్వామి, మాజీ సర్పంచ్ అశ్వర్థప్ప, కన్వీనర్ శ్రీరాములు, త్రివేంద్ర, షౌకత్, నరేంద్ర పాల్గొన్నారు.


సమావేశమైన నాయకులు

ప్చ్..! ఉన్నారంతే..!

కనిపించని ఖాకీ మార్కు

- నేరాలపై కనీస సమాచారంలేని వైనం
- ఉన్నా.. స్పందించని దుస్థితి
- అసాంఘిక కార్యకలాపాలకు పోలీసుల సహకారం
- హిందూపురం, మడకశిరలో కట్టుతప్పుతున్న శాంతిభద్రతలు

హిందూపురం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మడకశిర, హిందూపురం నియోజకవర్గాల్లో వరుస ఘటనలతో ఖాకీ పనితీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. క్షేత్రస్థాయిలో నేరాలపై కనీస సమాచారం పోలీసులకు ఉండట్లేదనీ, ఉన్నా.. స్పందించట్లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు ఆదేశిస్తే తప్ప కదిలే స్థితిలో లేరని తెలుస్తోంది. దీంతో నేరాలకు అడ్డుకట్ట పడట్లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. వైసీపీ హయాంలో ఆ పార్టీకి వీరవిధేయులుగా పనిచేసిన కొంతమంది సిబ్బంది పోలీసు శాఖకే మచ్చతెచ్చేలా వ్యవహరిస్తున్నారు. అసాంఘిక కార్యకలాపాల్లో చేతులు కలుపుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలవుతున్నా ఇప్పటికీ కొన్నిచోట్ల ఖాకీ మార్కు కనిపించట్లేదు. దీంతో అసాంఘిక శక్తుల ఆగడాలు సజావుగా సాగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మడకశిర, హిందూపురం నియోజకవర్గాల్లో పోలీసు మార్కు ఏదన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. చిత్తూరు జిల్లా తరహాలో ఇక్కడ కూడా పాతుకుపోయిన వారిని బదిలీ చేస్తే తప్ప.. అసాంఘిక శక్తులకు చెక్ పెట్టలేరన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



మడకశిరలో కిడ్నాప్ కల్చర్

ఎన్నడూలేని విధంగా మడకశిర పరిధిలో కిడ్నాప్ కల్చర్‌కు తెరలేపారు. గతేడాది నవంబరు 29న వరుసకు మామ అయిన వ్యక్తి పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థిని తీసుకెళ్లి కర్ణాటక సరిహద్దులో దారుణంగా హత్య చేశాడు. ఇది అప్పట్లో సంచలనం రేకెత్తించింది. మొదట కిడ్నాప్ అయ్యాడనీ, సురక్షితంగా ఇంటికి వస్తాడనుకున్న బాలుడు శవమై కనిపించడంతో పోలీసులు ఉలిక్కిపడ్డారు. తాజాగా ముగ్గురిని కిడ్నాప్ చేసిన కర్ణాటక ముఠా రూ.5 కోట్లు డిమాండ్ చేసింది. వారిని తీసుకెళ్లి కర్ణాటకలోని మారుమూల అటవీ ప్రాంతంలో బంధించి విచక్షణారహితంగా దాడి చేశారు. విషయం పోలీసులకు చెప్పడంతో ఇక్కడి నుంచి వెళ్లిన ప్రత్యేక బృందాలు సినీ ఫక్కీలో నిందితులను పట్టుకున్నాయి. ఈ కిడ్నాప్ జరిగిన 12 రోజులపాటు వారిని చిత్రహింసలు పెట్టారు. ఎట్టకేలకు కిడ్నాపర్ల నుంచి వారిని పోలీసులు రక్షించారు. స్థానికంగా పనిచేస్తున్న పోలీసుల్లో మాత్రం చలనం రాలేదన్నది నగ్న సత్యం. జిల్లా ఉన్నతాధికారులు స్పందించేవరకు స్థానికంగా ఉన్న పోలీసులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. కర్ణాటక సరిహద్దుకు ఆనుకుని ఉండటంతో ఇక్కడ నేరాలు చేసి టక్కున పక్క రాష్ట్రంలోకి జారుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇక్కడ పనిచేసే పోలీసులు నిరంతరం నిఘా ఉంచాలి. ఇక్కడ ఖాకీలు ఉదాసీనంగా వ్యవహరిస్తుండటంతో ఇలాంటి కిడ్నాప్ కల్చర్ ప్రారంభమైందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

హిందూపురంలో...

పురం నియోజకవర్గం కూడా కర్ణాటకకు ఆనుకుని ఉంది. కొంతమంది ఇక్కడ నేరాలకు పాల్పడి పక్క రాష్ట్రంలోకి వెళ్లిపోతున్నారు. ఇటీవల హిందూపురంలో చైన్ స్నాచర్లు పగలే బంగారు గొలుసులు లాక్కెళ్తున్నారు. పోలీసులు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చిన తరువాత కూడా ఓ వ్యక్తిని హత్య చేశారంటే ఖాకీ మార్కు ఏ రీతిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. పట్టణంలో కొంతమంది పోలీసు సిబ్బంది సహకారంతో హైటెక్ వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి అమ్మాయిలను పిలిపిస్తున్నట్లు సమాచారం. రెండ్రోజుల క్రితం ఓ వ్యభిచార గృహంపై పోలీసులు దాడి చేయగా.. ఇక్కడ పనిచేసి బదిలీపై వెళ్లిన కానిస్టేబుల్ రెడ్ హ్యాండెడ్‌గా దొరికాడు. సదరు కానిస్టేబుల్ అక్కడ ఎందుకున్నాడన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సదరు కానిస్టేబుల్ కనుసన్నల్లో వ్యభిచార గృహాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇలా.. కొందరు సిబ్బంది గుట్టుగా వ్యభిచార గృహాలు నిర్వహిస్తున్నట్లు చర్చ సాగుతోంది. ఇందులో ప్రమేయం ఉన్నవారిపై జిల్లా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాలి. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం. తూతూమంత్రంగా పోలీసులు దాడులు చేస్తూ అసలైన వారిని తప్పిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఏది ఏమైనా ఈ రెండు నియోజకవర్గాల్లో ఖాకీ మార్కు కనిపించడం లేదన్నది సుస్పష్టం..

చేతివాటం ప్రదర్శిస్తే చర్యలు

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర టౌన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అర్హులందరికీ ఇళ్ల మంజూరు చేయడమే లక్ష్యమని, ఇంటి పట్టాకోసం వచ్చే పేదల నుంచి డబ్బు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. శనివారం మడకశిర ఆర్అండ్‌బీ అతిథి గృహంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామితో కలిసి తహసీల్దార్లు వీఆర్ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మడకశిర నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా పేదలకు ఇళ్లు మంజూరు చేయాలని, నియోజకవర్గం వ్యాప్తంగా 15వేల ఇళ్ల వరకు మంజూరైనట్లు తెలిపారు. ఇళ్లులేని దళితులు, శ్మశాన వాటిక లేని గ్రామం ఉండకూడదన్నారు. ఇప్పటికే కొందరు అధికారులు పొజిషన్ సర్టిఫికెట్ జారీ విషయంలో చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయన్నారు. ఇళ్ల మంజూరు విషయంలో ఎవరైనా పేదల వద్ద డబ్బులు వసూలు చేశారని తమ దృష్టికి వస్తే వారిని ఉపేక్షించేది లేదన్నారు. అనంతరం ఎంపీడీఓలతో సమావేశమయ్యారు. గ్రామాల్లో తాగునీటి సమస్యతోపాటు ఇతర సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, జడ్పీటీసీ సభ్యులు ఉమేష్, మాజీ జడ్పీటీసీ సభ్యులు వి.ఎం.పాండురంగప్ప, ఐదు మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

గోరంట్ల, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పుత్రశోకంతో మనస్థాపం చెంది వృద్ధురాలు మృతిచెందింది. గోరంట్ల పట్టణంలోని ఎండలబండ వీధికి చెందిన అంజనప్ప, సాకమ్మ కుమారుడు శ్రీనివాసులు(31) ఫిబ్రవరి 10న మృతిచెందాడు. కుమారుడి మరణాన్ని జీర్ణించుకోలేక మనోవేదనకు గురైన సాకమ్మ మార్చి 10న ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకుయత్నించింది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం బెంగళూరుకు తరలించారు. చికిత్సకు లక్షల్లో ఖర్చు అవుతుండటంతో ఆమెను శనివారం అక్కడి నుంచి కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారు. గోరంట్ల సీఐ శేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.


సాకమ్మ (ఫైల్)

పోక్సోపై అవగాహన



మాట్లాడుతున్న న్యాయాధికారి అశోక్‌కుమార్

మడకశిరటౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పోక్సో యాక్టుపై శనివారం ప్రభుత్వ ఎస్‌వైటీఆర్ డిగ్రీ కళాశాల ఆవరణంలో మడకశిర జూనియర్ సివిల్ న్యాయాధికారి అశోక్‌కుమార్ అవగాహన కల్పించారు. ఈ చట్టంతో ఏవిధంగా న్యాయం జరుగుతుంది తదితరాలను వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు వై.సి.గోవర్ధన్‌రెడ్డి, సీఐ రాజ్‌కుమార్, న్యాయవాది గోవిందప్ప పాల్గొన్నారు.

'విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అవసరం'

హిందూపురం అర్బన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే పిల్లలు క్రమశిక్షణ ను అలవరచుకోవాలని డీఎస్పీ మహేష్, మున్సిపల్ చైర్మన్ రమేష్‌కుమార్ సూచించారు. శనివారం పట్టణ పరిధిలోని సప్తగిరి కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ మేనేజ్‌మెంట్ ఫేస్ట్‌ను నిర్వహించారు. ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థికి జీవిత పునాది కళాశాలలోనే పడుతుందన్నారు. తల్లితండ్రుల ఆశయాలు నెరవేర్చాలన్నా, ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నా కళాశాలలో క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో బాలాజీ ఎడుకేషన్ సొసైటీ ప్రత్యేక అధికారి శ్రీనివాసరెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనాథ్‌రెడ్డి, కళాశాల పాలనాధికారి గంగిరెడ్డి, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గోరంట్ల, మార్చి22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాజాపురం కేజీబీవీ పాఠశాలలో 2025-26 సంవత్సరానికి సంబంధించి ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శిరీషా శనివారం ప్రకటనలో తెలిపారు. 6నుంచి 11 తరగతులు ప్రవేశం కోసం ఏప్రిల్ 11 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

● గుడిబండ : మండలంలోని కరికెర గ్రామ సమీపంలో ఉన్న కస్తూర్బా బాలికల విద్యాలయంలో 2025-2026 విద్యా సంవత్సరానికి 6వతరగతి, ఇంటర్‌మీడియట్‌లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కేజీబీవీ ప్రిన్సిపాల్ వై.రమాదేవి తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఏప్రిల్ 11వతేదీలోపు బాలికలు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

● అమరాపురం : మండల కేంద్రంలోని కేజీబీవీలో ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్ఓ శోభ పత్రికా ప్రకటనలో తెలిపారు.

కొద్ది సమయం ఇవ్వండి

- కర్ణాటక సీఎం సిద్దరామయ్య

పావగడ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): వర్గీకరణపై సంబంధిత మంత్రులు, కమిటీలతో చర్చించి నిర్ణయాన్ని వెల్లడిస్తానని, అందుకు కొద్ది సమయం కావాలని కర్ణాటక సీఎం సిద్దరామయ్య తెలిపారు. శనివారం ఉదయం సీఎంతో ప్రముఖ న్యాయవాది అరుణ్‌కుమార్, పాదయాత్ర రథసారథి భాస్కర్‌ప్రసాద్ తదితరులు కలిశారు. ఈ నేపథ్యంలో సీఎం సిద్దరామయ్య సమయాన్ని కోరారు.


సిద్దరామయ్యతో చర్చిస్తున్న అరుణ్‌కుమార్, భాస్కర్ ప్రసాద్

వర్గీకరణపై తీర్మానం అభినందనీయం

అగళి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఎబీసీడీ వర్గీకరణను అసెంబ్లీలో తీర్మానించడం అభినందనీయమని అగళి ఎమ్మార్పీఎస్ నాయకులు నాగోజీ, లోకేశ్, రాయుడు, మల్లేష్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు, మందకృష్ణ మాదిగల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.


క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

వైభవంగా వెంకటేశ్వరుడి ప్రాకారోత్సవం

హిందూపురం అర్బన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని ప్రసిద్ధ పేట వెంకటరమణస్వామి దేవాలయంలో శనివారం ప్రాకారోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మూల విరాట్‌కు ప్రత్యేక అలంకరణ చేశారు. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరుడి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. గోవిందనామస్మరణతో పరిసర ప్రాంతాలు మార్మోగాయి.


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

విద్యుదాఘాతంతో గాయాలు

పెనుకొండ రూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో అసిస్టెంట్ హెల్పర్‌కు తీవ్రగాయాలయ్యాయి. రొద్దం మండలంలోని దండేపల్లి వద్ద శనివారం 11కేవీ విద్యుత్ తీగలు తగిలి చంద్ర తీవ్రంగా గాయపడ్డాడు. లైన్‌మెన్ వినోద్‌కుమార్, అసిస్టెంట్ హెల్పర్ చంద్ర శనివారం ఉదయం రొద్దం మండలంలోని పెద్దమంతూరు సబ్‌స్టేషన్, దండేపల్లి ఫీడర్‌చానల్ బ్రేక్‌డౌన్ కావడంతో మరమ్మతులకు వెళ్లారు. మరమ్మతులు చేస్తుండగా చంద్ర తీవ్రంగా గాయపడ్డాడు. హుటాహుటిన హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. ఈ విషయంపై ట్రాన్స్‌కో ఏడీ శేషగిరిని వివరణ కోరగా దండేపల్లి వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌లో మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై చంద్రకు గాయాలయ్యాయని, లైన్‌మెన్‌కు నోటీసులు జారీచేస్తున్నట్లు ఏడీ తెలిపారు.

430 మందికి ఉచిత వైద్యం

హిందూపురం అర్బన్, మార్చి 22,(ఆంధ్రజ్యోతి): యోగినారాయణ సేవాసమితి ఆధ్వర్యంలో ఎంఎస్‌రామయ్య మెడికల్ కళాశాల బెంగళూరు సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 430 మంది వైద్యసేవలు వినియోగించుకున్నారు. శనివారం పట్టణంలోని టీటీడీ కల్యాణమంటపంలో వివిధ విభాగాలకు చెందిన 35 మంది వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆదిత్యకుమార్, మునిసిపల్ చైర్మన్ డీఈ రమేష్‌కుమార్, కల్యాణమంటప నిర్వాహకుడు రాజ్యలక్ష్మీమోహన్, ఎమ్మెల్యే పీఏ బాలాజీ, యోగినారాయన సేవాసమితి హిందూపురం శాఖ అధ్యక్షుడు రవిశంకర్ పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

సోమందేపల్లి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని నక్కల గుట్ట కాలనీకి చెందిన రాజు ఈనెల 17 నుంచి కనిపించడంలేదని, ఆచూకీ తెలపాలని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అతడి భార్య పార్వతి శనివారం ఫిర్యాదు చేసినట్లు ఏఎస్ఐ మురళి తెలిపారు. ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

హిందూపురం అర్బన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రాయితీతో వ్యవసాయ పనిముట్లు పొందేందుకు రైతులు రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సురేంద్రనాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హిందూపురం మండలానికి సంబంధించి ట్రాక్టర్ పరికరాలు 23, పవర్ స్ప్రేయర్లు 17, పవర్ వీడర్ 1, బ్యాటరీ స్ప్రేయర్ 7 వచ్చినట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి పరికరాలు అందజేస్తామన్నారు.

నీటి సమస్య పరిష్కారం

సోమందేపల్లి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పందిపర్తి గ్రామంలో వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య తలెత్తకుండా శనివారం ముందస్తు చర్యలు చేపట్టారు. ఆయా గ్రామాలకు తాగునీటి పైప్‌లైన్ వేయించారు. అదేవిధంగా గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ గజేంద్ర, స్థానికులు పాల్గొన్నారు.

ఫాంపాండ్ పనులు ప్రారంభం

సోమందేపల్లి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ప్రపంచ జలవనరుల దినోత్సవం సందర్భంగా నూతన ఫాంపాండ్ పనులను సర్పంచ్ నరసింహులు శనివారం ప్రారంభించారు. మండలంలోని మాగేచెరువు పంచాయతీ రంగేపల్లి గ్రామంలో ఫారంపాండ్ పనులు ప్రారంభించిన అనంతరం ఉపాధికూలీలకు జలవనరుల దినోత్సవంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధిహామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్ రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

● మడకశిర రూరల్ : నీటి సంరక్షణను ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల ఇన్‌చార్జి డీన్ హరిబాబు సూచించారు. ప్రపంచ నీటి దినోత్సవాన్ని కళాశాలలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

నిబంధనల ఉల్లంఘన: ఎస్ఎఫ్ఐ


హిందూపురం అర్బన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): అన్ని పాఠశాలల్లో ఒంటిపూట బడులు నిర్వహిస్తుంటే పట్టణంలోని ఉషోదయలో మాత్రం మధ్యాహ్నం 3.30 గంటల వరకు నిర్వహిస్తున్నారని, చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు ఎంఈఓ గంగప్పకు శనివారం వినతిపత్రం ఇచ్చారు. ఎండలు తీవ్రమైన నేపథ్యంలో అన్ని పాఠశాలలను 12.30 గంటల వరకు నిర్వహించాలన్నారు. వెంటనే యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి మూర్తి, నాయకులు మహేష్, నాగేంద్ర పాల్గొన్నారు.

హామీ నెరవేర్చిన ప్రభుత్వం

సోమందేపల్లి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): చేనేతలకు ఉచిత విద్యుత్ ఇస్తామని ప్రజాగళం పాదయాత్రలో నారాలోకేష్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడం జరిగిందని తొగటవీరక్షత్రియ సంఘం అధ్యక్షుడు, చేనేత నాయకుడు సీసీ హరి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చేనేత కార్మికులకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్లు ఉచితంగా విద్యుత్ ఇస్తానని నాడు హామీ ఇచ్చారన్నారు. నేడు రాష్ట్రవ్యాప్తంగా చేనేతలకు ఆ మేరకు విద్యుత్ లభించడం సంతోషకరమన్నారు. భవిష్యత్తులో నేతన్నలకు పూర్వవైభవం తీసుకురావాలని కోరారు. చేనేత రుణాలు మంజూరుచేయాలని, ప్రతి చేనేతకు పక్కా ఇల్లు నిర్మించి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పర్యావరణ హితమైన కవర్లనే వాడండి: ఎంపీడీఓ

గోరంట్ల, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పర్యావరణ హితమైన కవర్లను వ్యాపారులు ఉపయోగించాలని ఎంపీడీఓ నరేంద్రకుమార్ శనివారం ఓ ప్రకటనలో సూచించారు. బయోడీగ్రేడబుల్ శ్యాంపిల్ కవర్లను తెప్పించడం జరిగిందని, ఈ కవర్లు మొక్కజొన్న స్టార్చు పదార్థంలో తయారైనవన్నారు. 20 రోజుల్లో మట్టిలో కలిసిపోగలవన్నారు. వీటివల్ల పర్యావరణానికి ఎలాంటి ముప్పుగాని, అనారోగ్య సమస్యలు తలెత్తవన్నారు. మండలంలోని వ్యాపారులు వీటిని వినియోగించేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ పేర్కొన్నారు.


బయో డీగ్రేడబుల్ కవర్లు, గ్లాసులు

సబ్‌జైలును తనిఖీ చేసిన న్యాయాధికారి


ఖైదీలకు సూచనలు ఇస్తున్న న్యాయాధికారి

హిందూపురం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నేరాలకు పాల్పడి జైలుకు వస్తే కుటుంబాలు అన్ని విధాలా నష్టపోతాయని సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీధర్ అన్నారు. స్థానిక సబ్‌జైలును శనివారం తనిఖీ చేశారు. జైలు నుంచి బయటకు వెళ్లాక సన్మార్గంలో మసలాలన్నారు. కార్యక్రమంలో సబ్‌జైలు అధికారి హనుమన్న పాల్గొన్నారు.